**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 101, పేజీలు - 08
ఆదివారం,అక్టోబర్ 11, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## రాజకీయ పోరాటమా..
# వ్యక్తిగత శత్రుత్వమా.?
### - ఈ దాడి దేనికి సంకేతం.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో రోజురోజుకూ ప్రజా సమస్యల ప్రాతిపదికన జరగాల్సిన చర్చలు కనుమరుగవుతూ, వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హనన డిజిటల్ దాడులే ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు, ప్రజా విధానాలపై ఆరోగ్యకరమైన విమర్శలు ఉండటం సహజం. అయితే, ప్రస్తుత తెలంగాణ రాజకీయ వాతావరణం ప్రజా సమస్యలను పక్కనపెట్టి, నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆరోగ్యం, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న క్యారెక్టర్ అస్సాసినేషన్ సంస్కృతికి అద్దం పడుతోంది.

### కేటీఆర్ అనారోగ్యంపై సెటైర్లు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు అస్వస్థత, జ్వరం కారణంగా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటున్నట్లు, అందుబాటులో ఉండటం లేదని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే, ఒక నాయకుడి అనారోగ్యంపై సానుభూతి ప్రదర్శించాల్సింది పోయి, ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, సోషల్ మీడియా విభాగం నేతలు దాని వెనుక ఏదో రహస్య కారణం ఉందంటూ కథనాలు అల్లడం మొదలుపెట్టారు. దర్యాప్తు సంస్థల భయం వల్లే ఆయన అనారోగ్యం డ్రామా ఆడుతున్నారంటూ రకరకాల ఊహాగానాలతో ప్రచారం చేయడం రాజకీయ నైతికత ఏ స్థాయికి దిగజారిందో చాటిచెప్పింది.

### సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత పోస్టులు

అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బిఆర్ఎస్ సానుభూతిపరులు, కాంగ్రెస్ వ్యతిరేకులు డిజిటల్ హ్యాండిల్స్ సాగిస్తున్న ప్రచారం కూడా హద్దులు దాటుతోంది. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన పోస్టులు పెట్టడం, మార్ఫింగ్ ఇమేజ్‌లు, వికృతమైన కంటెంట్‌ను వ్యాప్తి చేయడం పరిపాటిగా మారింది. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారంటూ ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లలో పలు కేసులు సైతం నమోదయ్యాయి. న్యాయపరమైన చర్యలు హెచ్చరిస్తున్నప్పటికీ, డిజిటల్ వేదికలపై వైరం ఏమాత్రం తగ్గడం లేదు.

2లో..

## ఓటు చోరీకి ఆధారాలేవీ?
### - ఈసీకి మద్దతుగా 124 మంది మాజీ బ్యూరోక్రాట్లు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)**ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమం(సర్)లో దాదాపు 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించారంటూ విపక్షాలు ఆందోళన చేస్తున్న వేళ ఈసీకి అనూహ్య మద్దతు లభించింది. ఈసీపై ఓటు చోరీ ఆరోపణలు చేస్తూ ఢిల్లీలో నిరసనలకు దిగుతున్న విపక్షాలపై మండిపడుతూ 124 మంది మాజీ బ్యూరోక్రాట్లు బహిరంగ లేఖ విడుదల చేశారు. ఇందులో మాజీ ఐఏఎస్ లు, ఐపీఎస్ లు, ఐఎఫ్ఎస్ లు ఉన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని వారు ఆందోళనకారుల్ని హెచ్చరించారు.తాము ఏ పార్టీకి చెందినవాళ్లం కాదంటూ వీరు ఈ లేఖను విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాల తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత వంటి అంశాల్లో తమకు సుదీర్ఘ అనుభవం ఉందని వారు పేర్కొన్నారు. ఆధారాలు లేకుండానే మన ఎన్నికలను రిగ్గింగ్ అయ్యాయంటూ అభివర్ణిస్తున్నారని, ఇలాంటి ప్రతి వ్యాఖ్య ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుందని వారు లేఖలో పేర్కొన్నారు. గతంలో ఎన్నికల్లో బూత్‌లను ఆక్రమించడం,

2లో..

## స్థానిక సంస్థల ఎన్నికలకు రెడీ
### - నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి

- అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులదే
- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



**అమరావతి (ప్రశ్న న్యూస్)**ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కేబినెట్ భేటీలో బీసీలకు రిజర్వేషన్లు, సీట్ల కేటాయింపులపై కీలకంగా చర్చించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 13న అన్ని రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ సమావేశం కానుందని తెలుస్తోంది. ఈ నెల 14 లేదా 15న ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 3 దశలలో నవంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది.

2లో..

## తెలంగాణలో బతుకమ్మ సంబరాలు షురూ
### రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం భారీ ఏర్పాట్లు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

2లో..

## విద్యుత్ కష్టాలు.. పొదుపే పరిష్కారం!

- ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- నీరు, విద్యుత్ సంక్షోభం రాకుండా సమగ్ర కార్యాచరణకు ఆదేశం
- అక్టోబర్ 12న అనధికారిక కేబినెట్ భేటీ ఏర్పాటు
- కరువు ప్యాకేజీ కింద కేంద్రం రూ.20,000 కోట్లు ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎల్‌నినో ప్రభావం తెలంగాణకు తీవ్ర సవాళ్లు విసిరే ప్రమాదం ఉందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వచ్చే ఏడాది జూన్‌లో రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సమస్యలను ముందుగానే అంచనా వేసి, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమైతే ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక వ్యూహాన్ని రూపొందించాలని స్పష్టం చేశారు. శుక్రవారం సీనియర్ అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో నీటి లభ్యత, విద్యుత్ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని సమీక్షించారు.

2లో..



## నువ్వు ఇంకా బతికే ఉన్నావా..
# పురుగుల మందు తాగలేదా

- సమస్య చెప్పుకోవడానికి వచ్చిన రైతుతో గజ్వేల్ ఎమ్మార్వో అవహేళనగా మాట్లాడారా.?
- నా పరిస్థితి చూస్తే నవ్వొస్తుందా.?" అని అడిగితే.. "అవును.. బరాబర్ వస్తది" అంటూ సమాధానం
- రైతు కన్నీళ్లకు విలువ లేదా.? అధికారుల కుర్చీలకు అహంకారమే అలంకారమా.? - తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మార్వోల తీరుపై సర్వత్ర విమర్శలే.. ప్రభుత్వ చర్యలేవి.?
- గజ్వేల్ నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారుల తీరు మారేది ఎప్పుడు.?




**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)**రైతే దేశానికి వెన్నెముక.. అన్నదాత కష్టంతోనే సమాజానికి అన్నం అన్న సంగతి అందరికీ తెలిసిందే కానీ కొంతమంది ప్రభుత్వ అధికారులకు అది ఇంకా తెలియకపోవడం దారుణంగా మారింది. అలాంటి రైతు తన వ్యవసాయ భూమికి సంబంధించిన సమస్యతో అధికారిని ఆశ్రయిస్తే పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఆ అధికారిపై ఉంటుంది. కానీ సమస్యతో వచ్చిన రైతును పరామర్శించాల్సింది పోయి, అవహేళన చేస్తూ మాట్లాడితే ఆ రైతు మనోవేదన ఎవరికి చెప్పుకోవాలి.? ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే ప్రజలను కించపరిస్తే పాలనపై నమ్మకం ఎలా నిలుస్తుంది.? గజ్వేల్ నియోజకవర్గం లో ప్రభుత్వ అధికారుల తీరు అత్యంత దారుణంగా మారింది. ప్రతి శాఖలో ఇదే పరిస్థితి నెలకొన్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్ ఎమ్మార్వోపై వచ్చిన ఆరోపణలు ఇప్పుడు ఇదే ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

### - పురుగుల మందు తాగలేదా అంటూ ప్రశ్నించారా.?

తన వ్యవసాయ భూమికి సంబంధించిన సమస్య కారణంగా జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు గజ్వేల్ ఎమ్మార్వోను ఆశ్రయించినట్లు సమాచారం. ఇప్పటికే సమస్యతో సతమతమవుతున్న రైతుకు భరోసా కల్పించి, నిబంధనల ప్రకారం పరిష్కార మార్గం చూపాల్సిన ఎమ్మార్వో నువ్వు ఇంకా బతికే ఉన్నావా, పురుగుల మందు తాగలేదా అంటూ అత్యంత హేళనగా నవ్వుతూ మాట్లాడిన వీడియోలు తెలంగాణ ప్రజలను విస్మయానికి గురి చేస్తున్నాయి. ఎమ్మార్వో అధికారుల తీరు ఇంత దారుణంగా ఉందని ఈ వీడియోని నిలువెత్తు నిదర్శనంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఒక రైతు తన భూమినే నమ్ముకుని బతుకుతున్నాడు. ఆ భూమికి సమస్య ఎదురైతే అతడి కుటుంబ జీవనాధారమే ప్రశ్నార్థకమవుతుంది. అలాంటి పరిస్థితుల్లో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారి నుంచి సానుభూతి, న్యాయబద్ధమైన స్పందన ఆశించడం తప్పా.? రైతు ఆవేదనను అర్థం చేసుకోవాల్సిన ఎమ్మార్వో అధికారి, అతడి మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదే విధంగా వక్ఫ్ బోర్డ్ భూములు కబ్జా అవుతుంటే గజ్వేల్ ఎమ్మార్వో పట్టించుకోకపోవడం వెనక ఆయన హస్తము ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

### నవ్వొస్తుందా అంటే.. బరాబర్ వస్తది!

తన పరిస్థితిని చూసి మీకు నవ్వు వస్తుందా.? అని రైతు ప్రశ్నించగా అవును.. వస్తది, బరాబర్ వస్తది అంటూ ఎమ్మార్వో అత్యంత అహంకారంగా సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. ఈ మాటలు అది కేవలం ఒక రైతును అవమానించడం మాత్రమే కాదు ప్రజాసేవలో ఉన్న అధికారుల బాధ్యతాయుత ప్రవర్తనపైనా తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అధికారుల కార్యాలయాలకు వచ్చే ప్రజలంతా సంతోషంగా ఉండి రావడం లేదు. భూమి సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్కులు, రెవెన్యూ రికార్డులు, వారసత్వ హక్కులు వంటి అనేక సమస్యలతో బాధపడుతూ వస్తుంటారు. వారి సమస్యలను వినడం, నిబంధనల ప్రకారం పరిష్కరించడం అధికారుల విధి. సమస్య పరిష్కారం సాధ్యం కాకపోతే అందుకు గల కారణాలను వివరించాలి. అంతేకానీ వ్యక్తిగత అవహేళనకు దిగడం ఎంతవరకు సమంజసమో రెవెన్యూ శాఖ మంత్రికే తెలియాలి.

### - మంత్రి,కలెక్టర్ స్పందిస్తారా.. చర్యలు తీసుకుంటారా.?

ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యమని చెబుతున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో రైతులకు ఎదురవుతున్న ఇలాంటి అనుభవాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గజ్వేల్ ఎమ్మార్వోపై వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించి సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. రైతు భూమి సమస్యను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి న్యాయం చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.

**రైతును అవమానించడం ప్రభుత్వ అధికారులకు హక్కుగా మారిందా.? రెవెన్యూ శాఖ మంత్రి సమాధానం చెప్పాలి. రైతు కన్నీళ్లను హేళనగా చూడకుండా, అతడి సమస్యకు పరిష్కారం చూపినప్పుడే ప్రభుత్వ పాలనపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది.**

## ఓటరుగా నమోదు బాధ్యత పార్టీ శ్రేణులు ఉద్యమంలా చేపట్టాలి
### - ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో భట్టి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి

2లో..

## రేడియల్ రోడ్ల కుంభకోణంపై
# సీఎం సమాధానం చెప్పాలి

- రూ.3296 కోట్ల రోడ్ల టెండర్లలో భారీ స్కామ్
- రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయాలన్న కేటీఆర్
- టెండర్ల ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటు చేసుకుంటుకున్న కుంభకోణాలను ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ బయటపెడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో కుంభకోణాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బయటపెట్టారు. రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్ 2 టెండర్లలో జరిగిన కుంభకోణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి అని కేటీఆర్

2లో..

ప్రజాప్రశ్న



# రాజకీయ పోరాటమా.. వ్యక్తిగత శత్రుత్వమా.?

### సోషల్ మీడియా వల్లేనా.?

ఈ రకమైన డిజిటల్ యుద్ధానికి ప్రధాన కారణం ఇరు పార్టీల సోషల్ మీడియా ఆర్మీలు నిర్వహిస్తున్న శైలేనని భావిస్తున్నారు. యూట్యూబ్ ఛానెళ్లు, ఎక్స్ , ఫేస్‌బుక్ , వాట్సాప్ గ్రూపుల ద్వారా కంటెంట్‌ను వైరల్ చేసే క్రమంలో లైకులు, వ్యూస్, రాజకీయాధిపత్యం కోసం ప్రత్యర్థులపై అత్యంత నీచమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. పాలనాపరమైన లోపాలు, విద్యుత్ సంక్షోభం, నిరుద్యోగం, ధరణి లేదా హైడ్రా వంటి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన చోట, నాయకుల వ్యక్తిగత బలహీనతలు లేదా వ్యక్తిగత జీవితాలే డిజిటల్ వేదికల్లో ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. తెలంగాణ సమాజం చైతన్యవంతమైన రాజకీయ పోరాటాలకు నిలయం. ఉమ్మడి రాష్ట్రంలో హుందాగా సాగిన సిద్ధాంత రాద్ధాంతాలు, హక్కుల పోరాటాల స్థానంలో ఇప్పుడు క్షుద్ర రాజకీయాలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు తెస్తోంది.

### రాజకీయాల్లో ప్రత్యర్థులు వ్యక్తిగత శత్రువులు కాదు!

నాయకుల మధ్య శత్రుత్వం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా వ్యక్తిగత కక్ష సాధింపుగా రూపాంతరం చెందుతుండటంతో, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు కూడా క్షేత్రస్థాయిలో పరస్పరం దాడులకు తెగబడే వాతావరణం ఏర్పడుతోంది. ఈ ధోరణికి తక్షణమే అడ్డుకట్ట పడకపోతే, ప్రజా సమస్యలు గాలికి కొట్టుకుపోయి కేవలం బురదజల్లుడు రాజకీయాలే రాజ్యమేలుతాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తమ పార్టీ సోషల్ మీడియా విభాగాలను అదుపులో ఉంచుకోవాల్సిన ప్రాథమిక బాధ్యత అగ్రనాయకత్వానిదే. వ్యక్తిగత దూషణలను, వికృతమైన డిజిటల్ పోస్టులను ఖండిస్తూ సీనియర్ నేతలు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినప్పుడే తెలంగాణ రాజకీయాల్లో పోగొట్టుకున్న హుందాతనాన్ని మళ్లీ పునరుద్ధరించడం సాధ్యమవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# ఓటు చోరీకి ఆధారాలేవీ?

బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లడం, వాటిలో అక్రమంగా ఓట్లు వేయడం, ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలు జరిగేవని వారు గుర్తుచేశారు. బూత్ ఆక్రమణను 1989లో పార్లమెంట్ నేరంగా ప్రకటించిందని ప్రస్తావించారు. 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా చూపిస్తూ.. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒక్క రీపోల్ కూడా అవసరం లేకుండా ఎన్నికలు జరిగాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ నమోదైందని గుర్తుచేశారు. మహిళల ఓటింగ్ కూడా రికార్డు స్థాయికి చేరిందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థుల తరఫున పోలింగ్ ఏజెంట్లు ప్రతి పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రక్రియను పర్యవేక్షిస్తారని, పోలైన ఓట్ల వివరాలతో కూడిన సంతకం చేసిన పత్రాన్ని పొందుతారని వివరించారు. ఈవీఎంలను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి, వారి సంతకాలతో భద్రపరుస్తారని తెలిపారు.కౌంటింగ్‌కు ముందు ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో ఉంచుతారని, అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు వాటి భద్రతను పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వీవీప్యాట్ పేపర్ స్లిప్పులు, ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపును సరిపోల్చే విధానం కూడా ఎన్నికల ప్రక్రియలో ఒక భద్రతా చర్యగా ఉందని గుర్తుచేశారు. ఈ విధానాన్ని సుప్రీంకోర్టు 2024లో సమర్థించిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలను పెద్ద ఎత్తున తారుమారు చేయాలంటే వివిధ ప్రభుత్వాలకు చెందిన అధికారులు, ఎన్నికల సిబ్బంది, ఓడిపోయిన అభ్యర్థుల ఏజెంట్లు సహా ఎంతోమంది సహకరించాల్సి ఉంటుందని మాజీ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఇలాంటి భారీ కుట్ర జరిగినట్లు నిరూపితమైన ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థను విమర్శించే వారు తమ ఆరోపణలకు తగిన ఆధారాలను చూపాలని సూచించారు.

# విద్యుత్ కష్టాలు.. పొదుపే పరిష్కారం!

### నీటి బొట్టు.. విద్యుత్ యూనిట్ కీలకమే!

ఎల్‌నినో ప్రభావంతో సంక్షోభ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున నీరు, విద్యుత్ వినియోగంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సీఎం సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యుత్ లభ్యతపై ఒత్తిడి పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, విద్యుత్‌పై అధికంగా ఆధారపడే పనులను సాధ్యమైనంత వరకు వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రజల్లో నీరు, విద్యుత్ పొదుపుపై అవగాహన పెంచేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మీడియా, సినిమా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

### 235 మండలాల్లో కరవు ఛాయలు!

అధికారుల నివేదికల ప్రకారం రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు, సుమారు 235 మండలాల్లో కరవు ఛాయలు కనిపిస్తున్నట్లు సమీక్షలో వెల్లడైంది. ఈ పరిస్థితులు వ్యవసాయం, సాగునీటి సరఫరా, తాగునీటి లభ్యతపై ప్రభావం చూపే అవకాశాలున్న నేపథ్యంలో ముందస్తు చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. కరవు ప్రభావిత మండలాలను ఆదుకునేందుకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన అంశాన్ని కూడా ప్రస్తావించారు.

### 12న కీలక సమావేశం.. రైతులతో సీఎం చర్చలు

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహంపై మరింత లోతుగా చర్చించేందుకు అక్టోబర్ 12న అనధికారిక మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీటి లభ్యత, విద్యుత్ డిమాండ్, తక్షణ ఉపశమన చర్యలపై సమగ్రంగా చర్చించనున్నారు.

రైతు సంఘాలు, రంగ నిపుణుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. అనంతరం రైతులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయిలోని పరిస్థితులను తెలుసుకోనున్నారు. దీర్ఘకాలిక కార్యాచరణకు విస్తృత రాజకీయ, ప్రజా మద్దతు కూడగట్టేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

### ముందస్తు ప్రణాళికే అసలు పరిష్కారం!

ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందనే దానిపై వాతావరణ పరిస్థితుల ఆధారంగా స్పష్టత వచ్చినప్పటికీ, సంభావ్య సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధత కీలకం కానుంది. నీటి వనరుల సంరక్షణ, పంటల ప్రణాళిక, తాగునీటి సరఫరా, విద్యుత్ నిర్వహణ, రైతులకు సకాలంలో సహాయం వంటి అంశాల్లో ప్రభుత్వ చర్యలు నిర్ణయాత్మకంగా మారనున్నాయి.

సమీక్షలు, సమావేశాలకే పరిమితం కాకుండా కార్యాచరణ క్షేత్రస్థాయిలో ఎంత సమర్థంగా అమలవుతుందన్నదే రానున్న నెలల్లో తెలంగాణ ప్రజలకు భరోసా కల్పించనుంది.

# తెలంగాణలో బతుకమ్మ సంబరాలు షురూ

సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు తరలివచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. చారిత్రక హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ ఉత్సవాలు నిర్వహించారు.ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు, అక్టోబర్ 18న జరిగే సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది.

తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత, నైవేద్యం ఉంటుంది. ఈ ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించింది. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు.

ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చే ప్రజల కోసం ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు వంటి పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తంగేడు, గునుగు వంటి సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేరుస్తూ, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు రెడీ

కేబినెట్ భేటీ ముగిసిన తరువాత మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయి వారికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి చేసి, రెగ్యులర్ పాలన వచ్చేలా చూద్దామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 100శాతం గెలవాలని ఆకాంక్షించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని, చురుకుగా వ్యవహరిస్తూ వారి విజయం సాధించేలా చూసుకోవాలని సూచించారు.

### బీసీల రిజర్వేషన్లపై భరోసా

ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ, వారి రిజర్వేషన్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డెడికేటెడ్ బీసీ కమిషన్ (రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్) సమర్పించిన నివేదిక, సిఫార్సులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కొత్త నిర్ణయం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు లభించే స్థానాలు పెరగనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల్లో కేవలం 33 వేల మంది బీసీలకు మాత్రమే అవకాశాలు దక్కగా, ప్రస్తుత నిర్ణయంతో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో దాదాపు 38 వేల మందికి పైగా బీసీ ప్రజాప్రతినిధులకు పదవులు దక్కనున్నాయి. బీసీలకు గతంలో కంటే సుమారు 4 వేలకు పైగా స్థానాలు రగనున్నాయి.జిల్లాలు, వార్డులు, డివిజన్ల పునర్విభజనతో పాటు పెంపును పరిగణనలోకి తీసుకుని, జనాభా ప్రాతిపదికన ఈ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు మినహా ఇతర అన్ని విభాగాల పరిధిలోని దాదాపు 1.40 లక్షలకు పైగా స్థానాల్లో బీసీ రిజర్వేషన్లను వర్తింపజేసేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. స్థానిక చట్టాలు, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు భంగం వాటిల్లకుండానే బీసీలకు గరిష్ట స్థానాల్లో పోటీ చేసేలా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది.

### రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా సీట్లు కేటాయింపు

అంతేకాకుండా, సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతానికి మించకుండా డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులను ఏపీ ప్రభుత్వం ఆమోదించింది. దీని ద్వారా న్యాయపరమైన చిక్కులు రాకుండా పక్కాగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఏవైనా కేటగిరీలలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం కంటే తక్కువగా ఉంటే, కూటమి పార్టీల తరఫున ఆయా పదవులను బీసీలకే కేటాయిస్తామని చంద్రబాబు ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# ఓటరుగా నమోదు బాధ్యత పార్టీ శ్రేణులు ఉద్యమంలా చేపట్టాలి



ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలంటే పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని భట్టి విక్రమార్క అన్నారు. జిల్లా స్థాయి సమావేశం అనంతరం ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలని, ఆ తర్వాత మండల, గ్రామస్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి సీనియర్ నాయకుడిని ఇన్‌ఛార్జిగా నియమించి, వారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. కాంగ్రెస్ కుటుంబాల్లోని పట్టభద్రులను గుర్తించి, వారంతా ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలని చెప్పారు. అనంతరం తటస్థ ఓటర్లను, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్న ఇతర వర్గాల పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు.

### 3.42 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలను ఇంటింటికీ వివరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సుమారు కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, దాదాపు కోటి 6 లక్షల కుటుంబాలకు చెందిన 3 కోట్ల 42 లక్షల మందికి ప్రతి నెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు లభించే సన్నబియ్యాన్ని పేదలకు ఉచితంగా అందించడం ద్వారా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, సుమారు 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఆర్థిక సహాయం అందించామన్నారు. గృహజ్యోతి పథకం కింద సుమారు 53 లక్షల మందికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకాల వల్ల కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గుతోందని చెప్పారు. సామాజిక భద్రతలో భాగంగా సుమారు 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ పథకం అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో సుమారు 12.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు ఒక గ్లాసు పాలు అందించే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వివరించారు.

### ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

రాష్ట్రంలో ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. తొలి దశలో 4.5 లక్షల ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రెండో దశలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసే దిశగా, ఒక్కో నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున ముందుకు సాగుతున్నామని వివరించారు. హైదరాబాద్‌లోనూ పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం 40 వేలకోట్ల రూపాయలు వెచ్చిస్తున్నదని చెప్పారు.

### ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతే లక్ష్యం

ఇందిరమ్మ జయంతి సందర్భంగా నవంబర్ 19న ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చే పెద్ద వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే, ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. కులం, మతం, ప్రాంతం వంటి భేదాలు లేకుండా తెలంగాణలోని కుటుంబాలకు భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను కరపత్రాల రూపంలో రూపొందించి ప్రతి ఇంటికీ అందించాలని భట్టి విక్రమార్క పార్టీ నాయకులకు సూచించారు.

### కాంగ్రెస్‌కు అంకితమైన కుటుంబం నుంచి సర్వోత్తమ్ రెడ్డి

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉందని పేర్కొన్నారు. రాంరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి వంటి నాయకుల కుటుంబం పార్టీకి అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ కోసం నిబద్ధతతో పనిచేసిన ఈ కుటుంబాన్ని పార్టీ ఎప్పటికీ మరిచిపోదని చెప్పారు. సర్వోత్తమ్ రెడ్డిని కేవలం ఒక అభ్యర్థిగా కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా భావించి ఆయన విజయం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల్లో ఓటు వేసే వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఉన్న ప్రాంతమని పేర్కొంటూ, అదే ఐక్యతను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చాటాలని, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్ మట్ట రాగమయి కోరం కనకయ్యలు ప్రసంగించారు. ఈ సమావేశానికి డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

# రేడియల్ రోడ్ల కుంభకోణంపై సీఎం సమాధానం చెప్పాలి

డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సీఎంకు బహిరంగ లేఖ రాశారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు కొత్తగా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి టెండర్లు పిలిచారు. కానీ పనుల్ని ప్యాకేజీలుగా, ముక్కలుగా చేసి నచ్చిన వారికే కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. నచ్చినవారికి అక్రమంగా కట్టబెట్టిన టెండర్లలో వందల కోట్ల అవినీతి జరిగిందన్నారు. ముందస్తుగా నిర్ణయించుకున్న వారికే టెండర్లు కట్టబెట్టారు. వెంటనే టెండర్లను రద్దుచేసి అక్రమాలపై విచారణ జరపాలి అని డిమాండ్ చేశారు.ప్రతి అనర్హతకు నిర్దిష్ట కారణాలను పేర్కొంటూ సాంకేతిక మూల్యాంకన నివేదికను విడుదల చేయాలి. మూడు ప్యాకేజీల ఆర్థిక వివరాలను వెల్లడించాలి. అంచనా వ్యయాలు, తుది కేటాయింపు విలువలు, అర్హత సాధించిన ప్రతి బిడ్డర్ ఆర్థిక బిడ్ వివరాలను విడుదల చేయాలి. రేడియల్ రోడ్ల టెండర్ల రికార్డులను బహిర్గతం చేయాలి. బిడ్ ఓపెనింగ్ స్టేట్‌మెంట్లు, కంపారిటివ్ స్టేట్‌మెంట్లు, మూల్యాంకన కమిటీ సమావేశాల మినిట్స్‌ను వెల్లడించాలి. రూ.600 కోట్ల ఆర్థిక నష్టం ఆరోపణపై సమగ్ర విచారణ జరపాలి. ధరల వ్యత్యాసాలు, బిడ్ల వివరాలు, తుది కేటాయింపులపై పూర్తిస్థాయి పరిశీలన జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. గత మూడేళ్లలోని భారీ కాంట్రాక్టులపై కాగ్ ప్రత్యేక ఆడిట్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ చేపట్టిన రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై ఆడిట్ జరిపించాలి. టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి. బిడ్డర్లు, అనర్హతలు, అంచనా వ్యయాలు, తుది కేటాయింపు ధరలు, కాంట్రాక్టులు పొందిన సంస్థల వివరాలను వెల్లడించాలి. టెండర్ల ప్రక్రియలో పారదర్శకతకు స్పష్టమైన నిబంధనలు రూపొందించాలి. సాంకేతిక అర్హతలపై నిర్ణయాలు తీసుకునే విధానం, బిడ్డర్లు వివరణ ఇచ్చేందుకు కల్పించే అవకాశం, సాంకేతిక ఫలితాలు ప్రకటించిన తర్వాత ఆర్థిక బిడ్లు తెరవడానికి అనుసరించే వ్యవధిపై స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి

**- ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు."మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10–15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు.నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.

# సూర్యాపేట జిల్లా కేంద్రంలో కదం తొక్కిన గులాబీ శ్రేణులు



**సూర్యాపేట** జిల్లా ఏర్పడి 10 వసంతాలు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దల చెరువు నుండి కొత్త బస్టాండ్ వరకు 2ఐ రన్ నిర్వహించి, జిల్లాను ఏర్పాటు చేసిన కేసీఆర్ కి బీఆర్ఎస్ కార్యకర్తలు, పట్టణ ప్రజలు, యువత కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు డా. గాదరి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దీపికా యుగంధర్ రావు, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు, నంద్యాల దయాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు.

# ప్రజా వ్యతిరేకతను బేఖాతరు చేస్తున్న ఎక్సైజ్ శాఖ

- రేణిగుంటలో జనావాసాలు, బడుల మధ్యే యథేచ్ఛగా వైన్ షాపులు?
- తొమ్మిది రోజులుగా మహిళలు, ప్రజా సంఘాల నిరసనలు....
- తీరుమారని ఎక్సైజ్ అధికారులు.....
- నిబంధనల పేరుతో కాలయాపన...
- వైన్‌షాపుల యజమానులకు కొమ్ముకాస్తున్న వైనం?

విచారణ పేరుతో చేతులు దులుపుకుంటున్న అధికారులు?



**రేణిగుంట:** ప్రత్యేక ప్రతినిధితిరుపతి జిల్లా రేణిగుంటలో ప్రజల ప్రాణాలతో, మహిళలు, విద్యార్థుల భద్రతతో ఎక్సైజ్ శాఖ చెలగాటమాడుతోంది. జనావాసాలు, పవిత్ర ప్రార్థనా స్థలాలు, బడులు, బస్టాప్‌లకు అతి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన 'ఆద్య వైన్స్', 'సర్వేశ్ వైన్స్' మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు, మహిళా సంఘాలు భగ్గుమంటున్నాయి. అయితే, ప్రజా ఆగ్రహాన్ని, మహిళల ఆవేదనను కనీసంగా కూడా పరిగణనలోకి తీసుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు.. "నిబంధనల ప్రకారమే వైన్ షాపులు నడుస్తున్నాయి" అంటూ బాధ్యతారహితమైన ప్రకటనలు చేయడం పట్ల సర్వత్రా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.?తొమ్మిది రోజులుగా ఆందోళనలు.. పట్టించుకోని అధికార యంత్రాంగం..రేణిగుంట పాంచాలినగర్ ప్రాంతంలో వెలిసిన ఈ మద్యం దుకాణాల వల్ల నిత్యం మహిళలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగుబోతుల బెడదతో ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని, అసాంఘిక కార్యకలాపాలకు ఈ దుకాణాలు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ దుకాణాలను తక్షణమే ఊరి బయటకు తరలించాలని కోరుతూ స్థానికులు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా రోడ్డు ఎక్కి నిరసనలు, ధర్నాలు చేస్తున్న.. ప్రభుత్వంలో స్పందన కరువైంది. గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదుతో తంతు తూతూ మంత్రంగా విచారణ...ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో సెప్టెంబర్ 28న తిరుపతి జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్లులో బాధితులు స్పష్టమైన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై శనివారం ఉదయం ఎక్సైజ్ సీఐ ఏలూరు నరసానాయుడు బృందం విచారణకు దిగింది. ఈ సందర్భంగా స్థానికులు మునస్వామి రాయుడు శివప్రసాద్ ప్రసన్నలక్ష్మి తదితరులు మద్యం దుకాణాల వల్ల జరుగుతున్న అనర్థాలను అధికారుల ముందు పూస గుచ్చి వివరించారు.నిబంధనల ముసుగులో వైన్ షాపుల తొలగింపునకు ఎసరు...మహిళల భద్రతను ప్రజా శ్రేయస్సును గాలికి వదిలేసి ఎక్సైజ్ నిబంధనల ప్రకారమే దుకాణాలున్నాయి. అంటూ అధికారులు చెబుతున్న మాటలు వింటే వారికి ప్రజల ఆరోగ్యం కంటే వ్యాపారుల ప్రయోజనాలే ముఖ్యమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనావాసాల మధ్య బడులు గుడుల పక్కనే మద్యం దుకాణాలు ఉంటే నిబంధనలు ఎలా సంక్రమవుతాయని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న ఈ మద్యం దుకాణాలను తక్షణమే తొలగించాలని లేనిచో ప్రజా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ హెచ్చరించారు. ఈ విచారణ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు భారతి సిపిఎం నాయకులు వెంకటరమణ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ సిఐటియు మండల కన్వీనర్ సెల్వరాజ్ తదితరులు పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఆ మద్యం దుకాణాలను అక్కడి నుంచి శాశ్వతంగా తరలించాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# లెనిన్ సెంటర్ లో అఖిల పక్షాల ఆందోళన

- లెనిన్ సెంటర్





ఓట్ల దొంగ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని, సర్ ను రద్దు చేయాలని, ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతూ అఖిల పక్షాలు, ప్రజా సంఘాలు చేపట్టిన చలో లోక్ భవన్ కార్యక్రమంలో వందలాదిమంది లెనిన్ సెంటర్ కు చేరుకున్నారు. పోలీసుల ముందస్తు అరెస్టులు, నిర్బంధాలను ఛేదించుకుని కార్యకర్తలు, విద్యార్థులు, యువత, పార్టీల, సంఘాల నేతలు వందలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు మహిళలను, విద్యార్థినులను సైతం పోలీసులు ఈడ్చుకొని వెళ్లి పోలీస్ వాహనాల్లో వేశారు. పలువురికి గాయాలయ్యాయి.అలంకార్ సెంటర్, లెనిన్ సెంటర్లలో కార్యకర్తలు బైఠాయించి పెద్ద ఎత్తున మోడీ ప్రభుత్వానికి, ఎన్నికల కమిషనర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.వందలాదిగా పోలీసులు, పదుల సంఖ్యలో వాహనాలతో మోహరించినప్పటికీ కార్యకర్తలు, యువత తరలివచ్చి ఉధృతంగా ఆందోళన సాగించారు, ఓట్లు దొంగ జ్ఞానేశ్ కుమార్ ను మోడీ, అమిత్ షా, బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందని, వారంతా కుమ్మక్కయ్యారని నేతలు ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ,కూటమి సర్కార్ ఓటు హక్కును పరిరక్షించాల్సిపోయి, నిసిగ్గుగా ఎన్నికల కమిషన్ ను, కేంద్ర ప్రభుత్వాన్ని బలపరచటం సిగ్గుచేటుఓట్ల దొంగలు ఉన్న అరెస్టు చేయకపోగా ఓటు హక్కు కోసం పోరాడుతున్న వారిని అరెస్టు చేయటం దుర్మార్గం. ఢిల్లీలో మోడీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం, నిర్బంధాన్ని ప్రయోగించడం, అణిచివేయటం గర్హనీయమని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు అన్నారు.

# ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, బీసీ బిడ్డ..

## నందికొట్కూరు చైర్మన్ రేసులో జనసేన నేత మాసమ్ సాహెబ్

- ప్రజారాజ్యం నుండి జనసేన వరకు.. పార్టీ కోసం ప్రాణం పెట్టిన సమాజసేవకర్తకు చైర్మన్ పదవే లక్ష్యం
- వేతనంలో సగం పేదలకే.. నందికొట్కూరును అభివృద్ధి బాటలో నడిపిస్తా మాసమ్ సాహెబ్ సంచలన హామీ



**నందికొట్కూరు** ప్రజారాజ్యం నుంచి జనసేన వరకు పార్టీ జెండా మోసిన నిఖార్సయిన జన సైనికుడు బీసీ బిడ్డ మాసమ్ సాహెబ్ నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ పీఠంపై కన్నేశారు. జనసేన పార్టీ అవకాశం ఇస్తే చైర్మన్ రేసుకు సిద్ధమని సంచలన ప్రకటన చేశారు.తాను రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, సమాజ సేవకుడిగా నందికొట్కూరు పట్టణంలోనే పుట్టి పెరిగానని, ఈ పట్టణంలోని ప్రతి వీధి, ప్రతి సమస్య తనకు తెలుసని ఆయన పేర్కొన్నారు.క్యాడర్ ఆవేదనను వినిపించిన మాసమ్ సాహెబ్.2024 ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం నందికొట్కూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో జనసేన నాయకులు కార్యకర్తలు వీరమహిళలు ప్రాణం పెట్టి పనిచేశారు.కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనకు చెప్పుకోదగ్గ నామినేటెడ్ పదవులు గానీ టెండర్లు గానీ ఎక్కడా దక్కలేదు.ఇది చాలా బాధాకరం. దీంతో నియోజకవర్గ స్థాయిలో క్యాడర్ తీవ్ర అలకతో ఉంది. పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్తలకు అధికారికంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలి అని మాసమ్ సాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు.నాకు జనసేన పార్టీ చైర్మన్ గా అవకాశం ఇస్తే.. నందికొట్కూరు మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఎవరూ చూడని అభివృద్ధిని చేసి చూపిస్తా. కూటమిలోని తెలుగుదేశం బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ పట్టణాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తా.నేను చైర్మన్ గా తీసుకునే గౌరవ వేతనంలో సగభాగాన్ని పదవిలో ఉన్నంతకాలం పేద ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తానని మాట ఇస్తున్నా అని ఆయన ప్రకటించారు.జనసేనకు చైర్మన్ పదవి దక్కితే నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ లో నూతన ఉత్సాహం వస్తుందని పార్టీ మరింత బలోపేతం అవుతుందని మాసమ్ సాహెబ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కలెక్టరమ్మా మా.. మండలంను

# కరువు మండలంగా ప్రకటించండి

## - గ్రామ రైతు దాట్ల సుబ్బరాజు



**కౌతాళం** అమ్మా కలెక్టరమ్మా మా కౌతాళం మండలమును కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని రాజానగర్ గ్రామ రైతు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ మేడం కలెక్టర్ విన్న వించుకుంటున్నానని క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి ఆదుకోవాలని వర్షాధారణ వచ్చిన ఆశించినంతగా పంట దిగుబడిలు రాలేదని ఎకరానికి ఒకటి నుంచి రెండు క్వింటళ్లకు పరిమితమైందని కొన్ని గ్రామాల్లో పంట పొలంలో ఒక పిందా ఒకే కాయకే పరిమితం అయిందని గ్రామాల్లో నీరు లేక విత్తనాలు మొలసి ఎండి పోయాయాని వాపోయారు.వాగులు, వంకలు, కాలువలు, గుంతలు పక్కన ఉన్నా పంట పొలం లో దిగుబడి వచ్చిన 99 శాతం మంది రైతులకు ఎకరానికి 10 000 నుంచి 20,000 నష్టపోయారని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరువు మండలంగా ప్రకటిస్తే రైతును ఆదుకునే వారు అవుతారని కోరుచున్నాను. అలాగే 2024 నష్టపోయిన పంటలకు ఇన్సూరెన్స్ పరిహారం వెంటనే చెల్లించాలని కోరుచున్నాను. నాలుగు మండలాలు కరువు మండలం గా ప్రకటించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తిగా కోరుతున్నామని అన్నారు. నాయకులు అధికారులు రైతులు ఆదుకోలేక పట్టించుకోలేక విఫలమయ్యారని వర్షభవ పరిస్థితులతో లో పంటలు సాగు చేసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పెట్టుబడులు పెరిగి రైతులకు అప్పుల భారం అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు దగ్గర డబ్బులు కట్టించుకొని వారిని ఆదుకోవడం లో విఫలం అయ్యారని ఆరోపించారు.రైతుల తరపున వేడుకుంటున్నాను అని మా కౌతాళం మండలం కు కరువు మండల ప్రకటించి ఆదుకోవాలని కోరుతున్నాను. గ్రామాల్లో పశువులకు మున్ముందు నీటి కష్టాలు రాకుండా నీటి తొట్టెలను మారమ్మతులు చేసి నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలి పంచాయతీ అధికారులు ను కోరుకుంటున్నాను.

# గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ 2026లో 300 మందికి పైగా క్యాన్సర్ విజేతలు

- ఆశ, ధైర్యానికి ప్రతీకగా నిలవనున్న రన్
- అక్టోబర్ 11న గచ్చిబౌలి స్టేడియంలో 9వ ఎడిషన్ నిర్వహణ
- హైదరాబాద్‌లో ప్రత్యక్షంగా సుమారు 35,000 మంది పాల్గొనే అవకాశం
- క్యాన్సర్ అవగాహన రన్‌లో అత్యధిక సంఖ్యలో క్యాన్సర్ విజేతలు పాల్గొనే కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచే అవకాశం

**హైదరాబాద్ :** క్యాన్సర్‌ను జయించి జీవితంలో ముందుకు సాగుతున్న 300 మందికి పైగా క్యాన్సర్ విజేతలు, మరో 35,000 మంది రన్నర్లతో కలిసి క్యాంబియంట్ గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ 2026లో పాల్గొననున్నారు. ఎవర్‌నార్త్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ 9వ ఎడిషన్ అక్టోబర్ 11, ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనుంది.తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మందికి పైగా క్యాన్సర్ విజేతలు ఒకే వేదికపైకి వచ్చి పాల్గొనడం ఈ ఏడాది కార్యక్రమంలో అత్యంత ప్రత్యేకమైన అంశంగా నిలవనుంది. క్యాన్సర్ అవగాహన రన్‌లో ఇంత పెద్ద సంఖ్యలో క్యాన్సర్‌ను జయించిన వారు పాల్గొనడం, క్యాన్సర్‌పై ప్రపంచవ్యాప్త పోరాటానికి ఆశ, ధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కూడిన శక్తివంతమైన సందేశాన్ని అందించనుంది. క్యాన్సర్ అవగాహన రన్‌లో క్యాన్సర్ విజేతలు పాల్గొనే అతిపెద్ద కార్యక్రమాల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉంది.ఈ క్యాన్సర్ విజేతలు ఉదయం ×7:45 గంటలకు ప్రారంభమయ్యే ప్రత్యేక 'కాంకరర్స్ రన్'×లో పాల్గొంటారు. వారి భాగస్వామ్యం జీవితాన్ని వేడుకగా జరుపుకోవడంతో పాటు, క్యాన్సర్ నిర్ధారణ అయినంత మాత్రాన జీవితంలోని కలలు, ఆశయాలు, అవకాశాలు ముగిసిపోవని చాటిచెప్పనుంది.ప్రతి క్యాన్సర్ విజేత వెనుక పోరాటం, అనిశ్చితి, చికిత్స, పట్టుదలతో కూడిన ఒక కథ ఉంటుంది. కొందరు పెద్ద శస్త్రచికిత్సలు చేయించుకోగా, మరికొందరు కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలను ఎదుర్కొన్నారు. దీర్ఘకాలిక చికిత్స, కోలుకునే క్రమంలో ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమించి వారు ఈ రన్‌లో పాల్గొనడం, ప్రస్తుతం క్యాన్సర్‌తో పోరాడుతున్న వేలాది మందికి స్ఫూర్తినివ్వనుంది.300 మందికి పైగా క్యాన్సర్ విజేతలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా, క్యాన్సర్‌పై ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించి, దాని గురించి మరింత సానుకూలమైన అవగాహన కల్పించడమే గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ లక్ష్యం. వీరి భాగస్వామ్యం ద్వారా ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్స, పునరావాసం, మానసిక మద్దతు, స్క్రీనింగ్ సేవల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయనున్నారు.ఇటీవల క్యాన్సర్ నిర్ధారణ అయిన రోగులకు, వారి కుటుంబాలకు వందలాది మంది క్యాన్సర్ విజేతలు కలిసి పాల్గొనడం ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. క్యాన్సర్ నిర్ధారణతో జీవితం ముగిసిపోదు. ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స పొందడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉంటుంది.

# ప్రకాశం జిల్లాలో విషాదం..

## - పాకల బీచ్‌లో ఇద్దరు యువకులు మృతి

**సింగరాయకొండ:** ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సముద్రంలో స్నానానికి వెళ్లిన కనిగిరికి చెందిన ఏడుగురు యువకులు గల్లంతయ్యారు.సమాచారం అందుకున్న మెరైన్ సిబ్బంది వెంటనే స్పందించి ఐదుగురిని సముద్రం నుంచి బయటకు తీసుకొచ్చారు. అయితే వారిలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఇదిలా ఉండగా, సముద్రంలో గల్లంతైన మరో ఇద్దరి ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు మత్స్యకారుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో కనిగిరి ప్రాంతంలో విషాదం నెలకొంది. మృతుల పేర్లు, వయస్సులు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# బస్టాండులో వ్యాపారాల జోరు..

## - ప్రయాణికులకు నరకం - అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుల ఆగ్రహం.



**వనపర్తి.**నాలుగు దశాబ్దాలైనా మారని వనపర్తి బస్టాండ్ తీరు.పండుగ వేళ బస్సుల కోసం పడిగాపులు.. పట్టించుకోని అధికారులు.చెత్తాచెదారం మధ్యే ప్రయాణాలు.. అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఆగ్రహనీ.బస్టాండులో వ్యాపారాలకు ఇచ్చే ప్రాధాన్యం ప్రయాణికుల సౌకర్యాలకు ఏదీ? ఆదాయం మీద ఉన్న శ్రద్ధ.. ప్రయాణికుల ఇబ్బందులపై ఎందుకు లేదు? నాలుగు దశాబ్దాలు గడిచినా వనపర్తి ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మారకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దసరా పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు పడుతున్న అవస్థలు చూసి చలించిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు శనివారం బస్టాండ్ పరిసరాలను పరిశీలించి అధికారుల తీరుపై మండిపడ్డారు.బస్సుల్లేవు.. సౌకర్యాల్లేవు!జిల్లా కేంద్రం నుంచి నిర్ణీత సమయానికి బస్సులు నడపలేని దుస్థితి నెలకొందని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిపోలో సరిపడా బస్సులు లేక ప్రైవేట్ బస్సులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పండుగ సమయంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బస్సుల నిర్వహణలో లోపాలు, ప్రమాదాలపై అధికారులు దృష్టి సారించి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు.చెత్త కుప్పల మధ్య ప్రయాణమా?బస్టాండ్ పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయినా శుభ్రతపై అధికారులకు పట్టింపు లేకపోవడం దారుణమని సతీష్ యాదవ్ విమర్శించారు. అపరిశుభ్ర వాతావరణం ప్రయాణికుల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీరు, కూర్చునే వసతి తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు.

## వనపర్తి జిల్లా పదేళ్ల పండగ సందర్భంగా

# అభివృద్ధి ప్రస్తావని గుర్తు చేసుకుందాం

## - మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి** పరిపాలన వికేంద్రీకరణ పాలన సంస్కరణలు తెచ్చిన ఏకైక నాయకుడు కె.సి.ఆర్ 33జిల్లాల ఏర్పాటు కొత్త మండలాల ఏర్పాటు.విప్లవాతమమైన మార్పు.దశాబ్ది ఉత్సవాల కృతజ్ఞతా 5ఐ రన్ జయప్రదం చేద్దాం.పాల్గొననున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వాకిటి శ్రీధర్, ఃఖీా జిల్లా అధికార ప్రతినిధి. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల.చంద్రశేఖర్ రావుతెలంగాణ రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ పాలన సంస్కరణలలో భాగంగా 33నూతన జిల్లాలు, నూతన మండలాలు ఏర్పాటు చేసి 10సంవత్సరాలు అయిన సందర్భంగా.దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో. అక్టోబర్ 11,ఆదివారం, ఉదయం 6:00గంటలకు ప్రారంభం.స్థలం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాల నుండి నల్లచెరువు ట్యాంక్ బండ్ వరకు 5కె రన్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ తెలిపారు.అభివృద్ధి కాముకులు, యువకులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు, బి.ఆర్.ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని శ్రీధర్ విజ్ఞప్తి చేశారు

# రైతుల సౌకర్యాలే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం

- సహకార వ్యవస్థ బలోపేతానికి మరో ముందడుగు..
- ఐతవరం సొసైటీలో నూతన క్యాష్ కౌంటర్ ప్రారంభం.
- ఐతవరం సొసైటీ అభివృద్ధితో రైతులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి
- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ:** రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.నందిగామ మండలం ఐతవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ఖంఆూ) సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్‌ను ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం , మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు , మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీలో రైతులకు అందుతున్న సేవలు, నగదు లావాదేవీల నిర్వహణ, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై నాయకులు చర్చించారు. నూతన క్యాష్ కౌంటర్ అందుబాటులోకి రావడంతో రైతులు, ఖాతాదారులకు లావాదేవీల నిర్వహణ మరింత సులభతరం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల సేవలను మెరుగుపరచడం ద్వారా రైతులకు స్థానికంగానే అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుంది.

# పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

## మారేడ్ పల్లి తహసిల్దార్ మహమ్మద్ అసద్ ఉల్లా ఖాన్



తార్నాక (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసన మండలి మహబూబ్ నగర్ -రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, మారేడుపల్లి తహసిల్దార్ మహమ్మద్ అసద్ ఉల్లా ఖాన్ విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం- 18 మారేడుపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో అందుబాటులో ఉందని దాన్ని తీసుకొని నిర్ణీత గడువులోపు దరఖాస్తులను స మర్పించాలని కోరారు. అదేవిధంగా ఆన్లైన్లో కూడా దరఖాస్తు చే సుకునే అవకాశం ఉందన్నారు. అర్హులైన పట్ట భద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులో తమ పేర్లను ఓటరు జాబితా లో నమోదు చేసుకోవాలని కోరారు.

# మేడ్చల్ ఆర్టీసీ కాలనీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## ఆటపాటలతో సందడిగా సాగిన వేడుకలు..

## సంప్రదాయ దుస్తుల్లో మహిళల కోలాహలం





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు మేడ్చల్ ఆర్టీసీ కాలనీలోని రోడ్ నంబర్ వన్‌లో ఘనంగా నిర్వహించారు. మహిళలు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించడం విశేషం. ఇలాంటి వేడుకలు ప్రజల మధ్య స్నేహసంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తాయని స్థానికులు పేర్కొన్నారు.

# నేటి నుండి గడి మైసమ్మ దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ పట్టణం లోని గడి మైసమ్మ తల్లి దేవాలయంలో నేటి నుండి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకాలన్నాయి. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 19 వరకు జరుగు శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు వివిధ అలంకరణలతో భక్తులకు దర్శనమిస్తారు. ఇందులో భాగంగా మొదటి రోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇదేవిధంగా 12న లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో ఇవ్వగా 13న శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 14న శ్రీ గాయత్రీ దేవి 15న శ్రీ మహాలక్ష్మి దేవి 16న శ్రీ మహా సరస్వతి దేవి 17న శ్రీ రాజరాజేశ్వరి దేవి 18న శ్రీ దుర్గా దేవి 19న శ్రీ మహా కాళికాదేవి 20న శ్రీ గడి మైసమ్మ దేవి అలంకరణలతో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అంతేకాకుండా ఈనెల 14న చండీ హోమం, 18న లక్ష పూల పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

# కుక్క కాటును నిర్లక్ష్యం చేయవద్దు

## రేబిస్ ప్రాణాంతకం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: పోతుగంటి నరేంద్ర

## ఆరు నెలల క్రితం కుక్క కాటుకు గురై.. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

## జంతువు కరిస్తే వెంటనే వైద్యం.. యాంటీ రేబిస్ టీకాలు తప్పనిసరి





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కుక్క కాటును నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని పోతుగంటి నరేంద్ర ప్రజలకు హెచ్చరించారు. రేబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదని, జంతువు కరిచిన వెంటనే తగిన వైద్యం తీసుకోవాలని సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి రేబిస్ లక్షణాలతో చికిత్స పొందుతూ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించిందని పేర్కొన్నారు.వివరాల్లోకి వెళ్తే.. ఎల్లికట్ట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సుమారు ఆరు నెలల క్రితం కుక్క కాటుకు గురయ్యారు.

అయితే కాటు అనంతరం సకాలంలో అవసరమైన వైద్య చికిత్స తీసుకోకపోవడం, యాంటీ రేబిస్ టీకాలు వేయించుకోకపోవడం వల్ల ఆయన రేబిస్ వ్యాధి బారిన పడినట్లు సమాచారం. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని విద్యానగర్ ప్రాంతంలోని నల్లకుంట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం మృతి చెందినట్లు తెలిసింది.సదరు వ్యక్తికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులతో తాను మాట్లాడి వివరాలు తెలుసుకున్నానని, మెరుగైన వైద్యం అందించాలని కోరినట్లు పోతుగంటి నరేంద్ర తెలిపారు. అయినప్పటికీ ఆ వ్యక్తి మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

### కుక్క కరిస్తే వెంటనే స్పందించాలి

ఈ ఘటన ప్రజలందరికీ ఒక హెచ్చరికగా భావించాలని నరేంద్ర కోరారు. కుక్కలు, పిల్లులు లేదా ఇతర జంతువులు కరిచినా, గీరినా నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. గాయాన్ని వెంటనే సబ్బు, ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాల పాటు శుభ్రంగా కడగాలని, ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సలహా మేరకు యాంటీ రేబిస్ టీకాలు, అవసరమైతే రేబిస్ ఇమ్యూనోగ్లోబులిన్ తీసుకోవాలని తెలిపారు. వైద్యులు సూచించిన టీకాల కోర్సును పూర్తిచేయడం అత్యంత ముఖ్యమన్నారు.రేబిస్ లక్షణాలు కనిపించిన తర్వాత వ్యాధి దాదాపు ఎల్లప్పుడూ ప్రాణాంతకంగా మారుతుందని, అందుకే లక్షణాల కోసం వేచి చూడకుండా కాటు జరిగిన వెంటనే చికిత్స ప్రారంభించాలని సూచించారు.

పెంపుడు కుక్కలకు కూడా క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని కోరారు.

కుక్క కాటు చిన్న గాయమే కదా అని నిర్లక్ష్యం చేయవద్దు. సరైన సమయంలో వైద్యం తీసుకుంటే రేబిస్‌ను నివారించవచ్చు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలి అని పోతుగంటి నరేంద్ర విజ్ఞప్తి చేశారు.

# మైనర్ బాలిక అక్రమ రవాణా కేసును ఛేదించిన టోలిచౌకి పోలీసులు

## 24 గంటల్లోనే ఎనిమిది మంది నిందితుల అరెస్ట్.. ఆరు సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం

## ఆహారం, వసతి పేరుతో బాలికకు మాయమాటలు.. వ్యభిచార గృహానికి తరలించి రూ.30 వేలతో బేరం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మైనర్ బాలికను అపహరించి, అక్రమంగా తరలించి, బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టిన కేసులో టోలిచౌకి పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, కేసు నమోదు చేసిన అనంతరం నిందితులను గుర్తించి, 24 గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

### ఆహారం, వసతి పేరుతో మోసం

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. సెప్టెంబర్ 2, 2026న షేక్ ఆతిఫ్ అనే నిందితుడు టోలిచౌకి నుంచి టీఎస్ 30 టీ 8350 నంబరు గల ఆటోలో మైనర్ బాలికను తీసుకెళ్లాడు. ముందస్తు పథకం ప్రకారం అత్తాపూర్ ప్రాంతానికి తరలించి, సనా అలియాస్ ఆఫ్రీన్, సమ్రీన్ బేగం అనే ఇద్దరు మహిళలకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.మంచి ఆహారం, వసతి కల్పిస్తామని బాలికను నమ్మించిన ఆ ఇద్దరు మహిళలు, అత్తాపూర్‌లోని పిల్లర్ నంబరు 200 సమీపంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న సబియా బేగంకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇందుకు ప్రతిఫలంగా రూ.30 వేలు తీసుకుని, ఆ మొత్తాన్ని తమ మధ్య పంచుకున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు.

### బలవంతంగా లైంగిక దోపిడీ

బాలికను వ్యభిచారంలోకి బలవంతంగా నెట్టినట్లు, ఆమెను విడిచిపెట్టాలని వేడుకున్నప్పటికీ పట్టించుకోకుండా పలువురితో లైంగిక దోపిడీకి గురిచేసినట్లు పోలీసుల వివరాలు వెల్లడిస్తున్నాయి. మరో ముగ్గురు నిందితులు కస్టమర్లను తీసుకురావడం, అవసరమైన వసతులు కల్పించడంలో సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ పరిస్థితుల్లో బాధిత బాలిక అక్టోబర్ 5న వ్యభిచార గృహం నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది. తనకు జరిగిన అన్యాయాన్ని కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు టోలిచౌకి పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### ఎనిమిది మంది అరెస్ట్.. కొనసాగుతున్న దర్యాప్తు

ఈ కేసులో షేక్ ఆతిఫ్, సబియా బేగం, మహమ్మద్ హాజీమియా, ఆఫ్రీన్ అలియాస్ సనా, సమ్రీన్ బేగం, ఎండీ నదీమ్, ఎండీ కైఫుద్దీన్, అలీ బిన్ అక్రమ్‌లను అక్టోబర్ 9న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో




భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టం, అనైతిక రవాణా నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. మైనర్ బాలికలను అక్రమంగా తరలించి లైంగిక దోపిడీకి గురిచేయడం ద్వారా డబ్బు సంపాదించడమే నిందితుల లక్ష్యంగా ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. నిందితుల పాత్ర, ఆర్థిక లావాదేవీలపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి పర్యవేక్షణలో, టోలిచౌకి డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫియాజ్ మార్గదర్శకత్వంలో టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ ఎల్. రమేష్ నాయక్, అదనపు ఇన్‌స్పెక్టర్ జి. బలరాజ్, ఎస్ఐ ఎస్. రవికుమార్, పోలీసు సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించారు.

# కుంటలో పడ్డ నుండి బొంద పెట్టే వరకు లొల్లే

# కుంటలో మునిగి యువకుడి మృతి

## మృతదేహం వెలికితీసిన 17వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) మోతే కిరణ్, చాట్ల ఆంజనేయులు మంచి ప్రాణ స్నేహితులు. స్నేహితుడు ఆంజనేయులు ఓ కుంట ను లీజుకు తీసుకొని చేపలు పెంచుతూ ఉపాధి పొందుతున్నాడు. అదే కుంట వద్ద మోతే స్వామితో కలిసి తాబేలు కూర వండుకొని దావత్ చేసుకుంటూ, నీ కుంటలో వలలు వేశారు అంటూ స్నేహితుడు చాట్ల ఆంజనేయులుకు ఫోన్ చేసి సమాచారం అందించాడు మోతే కిరణ్. వేల రూపాయలు పెట్టి లీజుకు తీసుకొని చేపలు పెంచుకుంటూ ఉంటే, వలలు వేసి చేపలు దొంగలించడం ఏంటి అని హడావిడిగా కుంట వద్దకు వెళ్లిన చాట్ల ఆంజనేయులుకు దావత్ చేసుకుంటూ మోతే కిరణ్, మోతే స్వాములు కనిపించారు. వలలు ఎక్కడ వేశారంటూ ప్రశ్నించడంతో, వలలు లేవు, ఏం లేవు. వట్టిగా పిలిస్తే నువ్వు వస్తావా, అందుకే ఇలా చెప్పిన అంటూ మోతే కిరణ్ అనడంతో ఎందుకు పిలిచావో చెప్పు అని చాట్ల ఆంజనేయులు అనడంతో, కనిపిస్తే లేదా కూర వండింది. దావత్ కి పిలిచిన కూర్చో అని తాబేలు కూర, సారా ప్యాకెట్లు ముందు పెట్టి తాగుమని కిరణ్ అన్నాడని ఆంజనేయులు తెలిపాడు. నాకు సారా వద్దు నేను క్వాటర్ అయితే తాగుతాను అని చెప్పడంతో బైక్ లో సగం సీసా ఉంది అని, రెండు పెగ్గులు వేసి బైక్ పంచర్ అయింది అని పంచర్ షాప్ కు వచ్చాను అని, పంచర్ చేయించుకుని వెళ్లి కిరణ్ ఎటుపోయిండని స్వామిని అడగడంతో నా మీది నుండే నడిచి వెళ్ళాడు అని మత్తులో ఉన్న స్వామి చెప్పాడని, అనుమానం వచ్చి కొంత సేపు వెతికి ఉడుము గిట్ల కనిపిస్తే దాని వెంట పరిగెత్తాడు కావచ్చు అని మళ్లీ వస్తాడు అంటూ ఇంటికి వచ్చాను అని ఆంజనేయులు తెలిపాడు. కానీ మద్యం మత్తులో కిరణ్ నీటమునిగి ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. వెంకటాపురం గ్రామానికి చెందిన మోతే ఎల్లయ్య, ఎల్లవ్వ దంపతుల కుమారుడు మోతే కిరణ్. స్నేహితులతో కలిసి దావత్ చేసుకుంటూ నీటిలో మునిగి విగత జీవిగా మారాడు. గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం రోజు దావత్ తీసుకుంటూ నీట మునిగిన కిరణ్ శనివారం ఉదయం కిరణ్ మృతదేహం తేలింది. మృతదేహాన్ని సిఐ ఓ వెంకటేష్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు 17వ ఐఆర్ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పి సి జె పి చటర్జీ, అసిస్టెంట్ సిఎంటి రాందాస్, ఇంచార్జ్ శ్రీనివాస్, ఇంచార్జ్ ఆర్ ఎస్ ఐ శేఖర్ ఆదేశాల మేరకు సర్దాపూర్ 17వ బెటాలియన్ డి.ఎస్.పి రాందాస్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, చాకచక్యంగా వెలికితీశారు.గంటల వ్యవధిలోనే ఆపరేషన్ పూర్తిచేసిన ఎస్డిఆర్ఫ్ బృందం, అధికారులకు అభినందనలు తెలిపారు. క్లిష్టమైన సమయంలో వేగంగా స్పందించి, ఎంతో బాధ్యతాయుతంగా రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేసిన డి.ఎస్.పి రాందాస్ ఆర్ఎస్ఐ శేఖర్ బృందం పనితీరును ఉన్నతాధికారులు కొనియాడారు. విధి నిర్వహణలో సిబ్బంది ప్రదర్శించిన అంకితభావాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి సంసిద్ధత ఎంతో ఆదర్శనీయమని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్ , ఎస్సై రమేష్ స్టేషన్ నుండి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మోతే కిరణ్‌కు భార్య సుమలత, ముగ్గురు చిన్న పిల్లలు సామిల్, సాము సోను, సలోమి ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కిరణ్ మృతితో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

### స్నేహితుల మీద అనుమానం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

తమ కొడుకు కిరణ్ ను ఇంటి వద్ద నుండి తీసుకెళ్లారని తన కుమారుడు మృతి పట్ల అనుమానం ఉందని, ఎల్లారెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు తల్లిదండ్రులు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శవయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు.

### అంత్యక్రియలు మా స్మశాన వాటికలో వద్దు





గుర్రం మాల, వడ్డెర కులస్తుల స్మశాన వాటికలోకి వచ్చి మీరు ఎలా అంత్యక్రియలు చేస్తారని, ఆ కులస్తులు అడ్డుకోవడంతో కొంచెం గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. హుటాహుటిన స్పందించిన పాలకవర్గం కులస్తులతో మాట్లాడి అధికారులతో చర్చించారు. స్మశాన వాటికను తాము వేల రూపాయలు పెట్టి అభివృద్ధి చేశామని ఆ బేడ బుడగ జంగం కులస్తులు ఒక్క రూపాయి ఖర్చు పెట్టకపోగా కనీసం చిన్న పనికి కూడా ఆసరా కాలేదని, గుర్రం మాల, వడ్డెర కులస్తులు ఆరోపించారు. ఓ పేదవాడు చనిపోతే మా స్మశానవాటికలో వేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదు కానీ, ఏ ఖర్చు పెట్టకుండా, ఏ పని చేయకుండా ఈరోజు మీరు శవాన్ని తీసుకొని వచ్చి అంత్యక్రియలు ఎలా చేస్తారని వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని గమనించిన పాలకవర్గం అధికారులు సమన్వయంతో చర్చించి అంత్యక్రియలు సజావుగా సాగేలా కృషి చేశారు.



# హీరోయిన్ల దుస్తులు, శరీరంపై కామెంట్స్..

## – తీవ్రంగా స్పందించిన మృణాల్

బాలీవుడ్ నటీనటులపై, ముఖ్యంగా హీరోయిన్ల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, శరీరాకృతిని లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై నటి మృణాల్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. తోటి నటీమణులు కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు ఆమె బాసటగా నిలిచారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని ఇష్టానుసారం జీవించే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె స్పష్టం చేశారు.ఇటీవల తన 'పూజా మేరీ జాన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రసవానంతర శారీరక మార్పుల కారణంగా కత్రినా కైఫ్ బాడీ షేమింగ్‌కు గురికావడం, ఒక జువెలరీ యాడ్‌లో ధరించిన దుస్తుల కారణంగా కృతి సనన్ విమర్శలు ఎదుర్కోవడం వంటి సంఘటనల నేపథ్యంలో ఆమె స్పందించారు. కత్రినా, కృతి ఇద్దరూ సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని గుర్తుచేశారు."ప్రతి విషయంలోనూ తప్పులు వెతకడం మానుకోవాలి. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే పిచ్చి పట్టినట్లుంది" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. వారి కృషిని, విజయాన్ని మరిచిపోయి చిన్న విషయాలపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఒకప్పుడు మహిళలను మాత్రమే ఎక్కువగా విమర్శించేవారని, కానీ ఇప్పుడు పురుషులు కూడా ఇలాంటివి ఎదుర్కొంటున్నారని మృణాల్ పేర్కొన్నారు. కాగా, విమర్శల నేపథ్యంలో కృతి సనన్ నటించిన జువెలరీ ప్రకటనను సంబంధిత సంస్థ ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.

# గ్రామీ బరిలో 'ధురంధర్' సౌండ్‌ట్రాక్..

## – ఏకంగా ఎనిమిది కేటగిరీల్లో ఎంట్రీలు!



రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం "ధురంధర్: ది రివెంజ్" సినిమా సంగీతం 2027 గ్రామీ అవార్డుల పరిశీలన కోసం ఎనిమిది విభాగాల్లో దరఖాస్తు చేసుకుంది. చిత్ర నిర్మాణ సంస్థ బి62 స్టూడియోస్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. దర్శకుడు ఆదిత్య ధర్ మరియు ఆయన సోదరుడు లోకేష్ స్థాపించిన ఈ స్టూడియో, సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ అందించిన బాణీలకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేలా ఈ ప్రచారాన్ని చేపట్టింది. ఈ సినిమాకు సంబంధించి సౌండ్‌ట్రాక్ ఆల్బమ్‌తో పాటు విడి పాటలను కలిపి మొత్తం తొమ్మిది ఎంట్రీలను గ్రామీకి పంపినట్లు స్టూడియో తెలిపింది. విజువల్ మీడియా కోసం ఉత్తమ సంకలన సౌండ్‌ట్రాక్ విభాగంలో ఈ ఆల్బమ్ పోటీపడుతుండగా, అరిజిత్ సింగ్ పాడిన "ఫిర్ సే" పాటను 'విజువల్ మీడియా కోసం వ్రాసిన ఉత్తమ పాట' విభాగానికి పంపారు. అలాగే "ఆరి ఆరి" పాటను 'ఉత్తమ ఆసియన్ పాప్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్' కేటగిరీకి, "జాన్ సే గుజార్తే హై", "కన్హయ్య" పాటలను 'ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్' విభాగంలోనూ పరిశీలిస్తున్నారు. "జాయే సజనా" పాటను 'ఉత్తమ పాప్ ద్యూయో పెర్ఫార్మెన్స్' విభాగంలో, "డెస్టినీ -- మన్ అట్కేయా" పాటను 'ఉత్తమ రాప్ పెర్ఫార్మెన్స్' విభాగంలో, "వారి జావాన్" పాటను 'ఉత్తమ డాన్స్, ఎలక్ట్రానిక్ రికార్డింగ్' విభాగంలో, అలాగే "హమ్ ప్యార్ కర్నే వాలే" పాటను 'ఉత్తమ రీమిక్స్డ్ రికార్డింగ్' విభాగంలో నామినేషన్ల కోసం సమర్పించారు. ఇర్షాద్ కమిల్ మరియు ఇతర రచయితలు సాహిత్యం అందించిన ఈ చిత్రంలోని పాటలకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్' ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సాధించింది. డిసెంబర్ 2025లో వచ్చిన మొదటి భాగం రూ. 1,300 కోట్లకు పైగా వసూలు చేయగా, మార్చి 2026లో విడుదలైన సీక్వెల్ "ధురంధర్: ది రివెంజ్" ప్రపంచవ్యాప్తంగా రూ. 1,800 కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించింది. అయితే, ఈ గ్రామీ సమర్పణలు కేవలం పరిశీలన కోసం మాత్రమేనని, ఇవి నామినేషన్లను నేరుగా ఖాయం చేయవని నిర్వాహకులు తెలిపారు. రికార్డింగ్ అకాడమీ అర్హత ప్రమాణాలను పూర్తి చేసుకుని, ఓటింగ్ ప్రక్రియను దాటిన తర్వాతే అసలు నామినేషన్లు ప్రకటిస్తారు.

# రజనీకాంత్ అభిమానులకు గుడ్ న్యూస్

## తెలంగాణలో సాధారణ టికెట్ ధరలకే 'జైలర్ 2'..




సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' సినిమా విడుదలకు ముందే టికెట్ ధరల అంశం చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సినిమాకు టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వడంతో అభిమానులు, సినీ ప్రేక్షకుల్లో చర్చ మొదలైంది. అయితే తెలంగాణలో మాత్రం ఈ సినిమా టికెట్ ధరలను సాధారణ స్థాయిలోనే కొనసాగించాలని నైజాం పంపిణీదారులు నిర్ణయించినట్లు సమాచారం. ఇదే నిజమైతే తెలంగాణలో సినిమా చూసే ప్రేక్షకులకు కొంత ఊరట లభించనుంది. రజనీకాంత్, నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో రూపొందుతున్న 'జైలర్ 2' అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినిమా విడుదలైన తొలి ఏడు రోజుల పాటు టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇచ్చింది. అక్టోబర్ 15 నుంచి 21 వరకు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.50, మల్టీప్లెక్స్‌లలో రూ.75 అదనంగా వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అలాగే రోజుకు ఐదు ఆటలు ప్రదర్శించుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. డబ్బింగ్ సినిమాకు కూడా టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వడంపై కొందరు నెటిజన్లు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. భారీ అంచనాలున్న సినిమాల కోసం ప్రేక్షకులు అదనపు ధరలు చెల్లించాల్సి రావడం సరైనదేనా? అనే చర్చ సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తోంది. మరోవైపు తెలంగాణలో 'జైలర్ 2' టికెట్ ధరల విషయంలో సరికొత్త నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నైజాం పంపిణీదారులు సాధారణ టికెట్ ధరలనే కొనసాగించాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమాచారం ప్రకారం సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధర రూ.175గా, మల్టీప్లెక్స్‌లలో రూ.295గా ఉండనుంది.అయితే తెలంగాణలో ఈ ధరలకు సంబంధించి అధికారిక ప్రకటన రావలసి ఉంది. సాధారణ ధరలే అమల్లో ఉంటే కుటుంబంతో కలిసి సినిమా చూడాలనుకునే ప్రేక్షకులకు, ముఖ్యంగా మల్టీప్లెక్స్‌లకు వెళ్లేవారికి కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.ఒకవైపు ఏపీలో టికెట్ ధరల పెంపు, మరోవైపు తెలంగాణలో సాధారణ ధరలకే సినిమా అందుబాటులో ఉంటుందన్న సమాచారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పండుగ సమయంలో విడుదలవుతున్న పెద్ద సినిమాలకు టికెట్ ధరలు కీలక అంశంగా మారుతున్నాయి.

# ఒక్కో సినిమాకు రూ.8 కోట్లు తీసుకుంటున్నానా ..

## – ప్రచారాలపై శ్రీనిధి శెట్టి క్లారిటీ..!



సినిమా ఇండస్ట్రీలో ఒక భారీ విజయం అందుకున్న తర్వాత హీరోలు, హీరోయిన్ల పారితోషికాలపై రకరకాల వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటీనటుల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. తాజాగా 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న కన్నడ నటి శ్రీనిధి శెట్టి పారితోషికంపై ఇలాంటి ప్రచారమే తెరపైకి వచ్చింది. ఆమె ఒక్కో సినిమాకు రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు తీసుకుంటున్నారంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రచారంపై స్పందించిన శ్రీనిధి శెట్టి అసలు విషయాన్ని వెల్లడించారు. శ్రీనిధి శెట్టి ఒక్కో సినిమాకు భారీ మొత్తంలో పారితోషికం డిమాండ్ చేస్తున్నారంటూ వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. ఇప్పటివరకు తాను చేసిన సినిమాల సంఖ్యను పరిశీలిస్తే ఇంత భారీ పారితోషికం గురించి జరుగుతున్న ప్రచారం ఆశ్చర్యంగా ఉందని ఆమె పేర్కొన్నారు. కేవలం పుకార్ల ఆధారంగా ఇలాంటి వార్తలను నమ్మవద్దని సూచించారు. సినిమాలను ఎంపిక చేసుకునేటప్పుడు పారితోషికానికే ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తనకు నచ్చిన కథ, అందులో తన పాత్రకు ఉన్న ప్రాధాన్యం, సినిమా నాణ్యత వంటి అంశాలనే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటానని వెల్లడించారు. 'కేజీఎఫ్' చిత్రాలతో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత వరుసగా ఎక్కువ సినిమాలు చేసుకుంటూ వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, తాను అలా చేయలేదని శ్రీనిధి శెట్టి అభిప్రాయపడింది. డబ్బు సంపాదించడమే లక్ష్యమైతే ఆ సినిమా విజయాన్ని ఆసరాగా చేసుకుని అనేక ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని పేర్కొంది. మంచి కథలు, తన నటనకు అవకాశం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నది తన ఉద్దేశమని ఆమె చెప్పుకొచ్చింది. సరైన కథ దొరికితే పారితోషికం విషయంలోనూ చర్చలకు సిద్ధంగా ఉంటానని, నటిగా ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడమే తనకు ముఖ్యమని స్పష్టం చేసింది. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన శ్రీనిధి శెట్టి మొదట మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. 2016లో 'మిస్ దివా సుప్రానేషనల్' టైటిల్‌ను గెలుచుకుని, అదే ఏడాది అంతర్జాతీయ స్థాయిలో 'మిస్ సుప్రానేషనల్' కిరీటాన్ని అందుకున్నారు. ఆ తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన 'కేజీఎఫ్: చాప్టర్ 1' సినిమాతో నటిగా పరిచయమయ్యారు. ప్రస్తుతం శ్రీనిధి శెట్టి విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నటిస్తున్నారు.

# తెలంగాణ పెండ్లి జోష్ చూస్తారు!



పూర్తిగా తెలంగాణ నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం' చిత్రాన్ని రూపొందించామని చెప్పారు నిర్మాత బూసం జగన్‌మోహన్ రెడ్డి. తరుణ్‌భాస్కర్, అనుపమ పరమేశ్వరన్, నరేష్ వీకే, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి భద్రప్ప గాజుల దర్శకుడు. ఈ నెల 16న విడుదలకానుంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్మాత బూసం జగన్‌మోహన్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తాను గతంలో ప్రభుత్వ యాడ్స్, డాక్యుమెంటరీలు చేశానని, నిర్మాతగా తనకది రెండో చిత్రమని తెలిపారు. 'యూనివర్సల్ ఎమోషన్స్ ఉన్న సబ్జెక్ట్ ఇది. అన్ని ప్రాంతాల వారికి కనెక్ట్ అయ్యే విధంగా ఉంటుంది. ఈ కథ విన్న ప్రతీ ఒక్కరూ అద్భుతంగా ఉందని చెప్పారు. దసరా టైమ్‌లో సినిమా రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. తెలంగాణ పెద్ద పండగ దసరా. ఈ సమయంలో ఎన్ని సినిమాలు వచ్చినా ప్రేక్షకులు చూస్తారు. పెళ్లి నేపథ్యంలో జరిగే ఈ కథలో వినోదంతో పాటు హృదయానికి హత్తుకునే భావోద్వేగాలుంటాయి. తెలంగాణ పెళ్లి జోష్ ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఈ సినిమా చూశాక ప్రేక్షకులు మంచి ఫీల్‌తో బయటకు వస్తారు' అని బూసం జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. ఈ కథ విన్నప్పుడు అనుపమ పరమేశ్వరన్‌నే కథానాయికగా అనుకున్నామని, ఆమెను తప్ప మరొకరిని ఈ పాత్రకు ఊహించుకోలేమని ఆయన చెప్పారు. సురేశ్ బొబ్బిలి మ్యూజిక్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని.. గోరటి వెంకన్న, కాసర్ల శ్యామ్, మిట్టపల్లి సురేందర్ వంటి తెలంగాణ కవులు అద్భుతమైన పాటల్ని అందించారని తెలిపారు. దాదాపు రెండొందల థియేటర్లలో సినిమాను విడుదల చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# ప్రభాస్ 'ఫౌజీ' విడుదల అప్పుడేనా?



ప్రభాస్ 'ఫౌజీ' సినిమా కోసం దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులంతా ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా రిలీజ్ డేట్లు చాలా మారాయి. డిసెంబర్ 3న విడుదల చేస్తున్నట్టు ప్రకటించగానే, ఇక ఆ డేట్ ఖాయమని అంతా అనుకున్నారు. అయితే.. చిత్రీకరణలో జాప్యం కారణంగా వచ్చే ఏడాదికి సినిమా వాయిదా పడింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం 2027, మార్చి 18న 'ఫౌజీ'ని విడుదల చేయనున్నట్టు తెలిసింది. ఈ నెల 23న ప్రభాస్ పుట్టినరోజు. ఈ సందర్భంగా విడుదల చేసే 'ఫౌజీ' గ్లింప్స్‌లో రిలీజ్ డేట్‌ని కూడా ప్రకటించనున్నారట. 'ఫౌజీ' లాంటి పాన్ ఇండియా చిత్రం రిలీజ్‌కి మార్చి 18 సరైన డేట్ అని ఫిల్మ్ వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆ రోజు గురువారం కాగా, మార్చి 21 ఆదివారం వరకూ లాంగ్ వీకెండ్ ఈ సినిమాకు కలిసొచ్చింది. అంతేకాదు, సోమవారం హోలీ పండుగ కారణంగా సెలవు కలిసొచ్చింది. మళ్లీ మార్చి 26న గుడ్ ఫ్రైడే. ఇవన్నీ 'ఫౌజీ'కి కలిసొచ్చే అంశాలు. అందుకే ఆ డేట్‌ని మేకర్స్ ఫిక్స్ చేసినట్టు వినికిడి. అయితే.. 'ఫౌజీ' మార్చి 18న రాబోతున్న సందర్భంగా ప్రభాస్ మరో పాన్ ఇండియా సినిమా 'స్పిరిట్' సినిమా కాస్త ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిజానికి 'స్పిరిట్'ని మార్చి 5న విడుదల చేయనున్నట్టు సందీప్‌రెడ్డి వంగా ఇప్పటికే ప్రకటించారు. ఇప్పుడు 'ఫౌజీ' కారణంగా 'స్పిరిట్' ఏప్రిల్‌కి వెళ్లే అవకాశం ఉన్నదని ఫిల్మ్ వర్గాలు చెబుతున్నాయి.



# మాతృత్వం తప్పనిసరి కాదు!

పెళ్లయిన ప్రతి జంటకు పిల్లలు ఉండాలనే నియమం ఏమీ లేదని కథానాయిక వరలక్ష్మి శరత్‌కుమార్ స్పష్టం చేసింది. తనకు పిల్లలు వద్దని నిర్ణయించుకున్నానని పేర్కొంది. ముంబయికి చెందిన వ్యాపారవేత్త, ఆర్ట్ గ్యాలరిస్ట్ నికోలాయ్ సచ్‌దేవ్‌ను 2024లో వివాహమాడింది వరలక్ష్మి శరత్‌కుమార్. తాజాగా తన నిర్ణయం వెనకున్న కారణాలను ఆమె ఓ ఇంటర్వ్యూలో వివరించింది. ఆమె మాట్లాడుతూ ' పిల్లలు పుట్టరని కాదు.. పిల్లలు నాకు కావాలనిపించడం లేదు.నా భర్త కూడా ఈ విషయంలో నా అభిప్రాయాన్ని గౌరవిస్తున్నారు. తల్లిదండ్రులుగా మారడం ఎంతో బాధ్యతతో కూడుకున్న విషయం. పిల్లల్ని పెంచడానికి ఆర్థికంగా బాగుంటే సరిపోదు. వారికి తగినంత సమయాన్ని కేటాయించడంతో పాటు ఓర్పు ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా భావోద్వేగపరమైన సంకల్పం అవసరం' అని చెప్పుకొచ్చింది. తన భర్త నికోలాయ్ సచ్‌దేవ్‌కు తొలి వివాహం ద్వారా ఓ కుమార్తె ఉందని, ఆమెను తన సొంత కుమార్తెగానే భావిస్తానని వరలక్ష్మి శరత్‌కుమార్ పేర్కొంది.

# సీఈసీని తొలగించాల్సిందే
# జ్ఞానేశ్‌కుమార్‌పై ప్రజాసంఘాల ధ్వజం

**ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్యానికి విఘాతం**
**కలిగించారని ఆరోపణ, దిష్టిబొమ్మ దహనం**




బుచ్చి (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో ఆయన ఏకపక్షంగా వ్యవహరిస్తూ, అధికార బీజేపీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. శనివారం సీపీఎం కార్యాలయం నుంచి బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎన్నికల సంఘం ప్రజల విశ్వాసాన్ని కాపాడటంలో విఫలమవుతోందని విమర్శించారు. ఎన్నికల జాబితాల సవరణ పేరుతో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఏకపక్షంగా అమలు చేస్తూ లక్షలాది మంది ఓటర్ల పేర్ల తొలగింపునకు కారణమయ్యారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌లోని ఇతర కమిషనర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు.గత రెండేళ్లుగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా ఎన్నికల సంఘం వ్యవహరించిందని నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగితే వారి రాజకీయ హక్కులకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పదవి నుంచి తొలగించే వరకు పోరాటం

ఎన్నికల సంఘం పనితీరుపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించాలని కోరారు. జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌పై కేంద్రం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ వెంకమరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి చల్లా కొలుసు మల్లికార్జున, అధ్యక్షుడు దాసరి రాధాకృష్ణయ్య, రైతు సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, పుత్తైటి మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నారాయణ, తంబి రమణయ్య, మద్దిశెట్టి సురేష్, ఆవాజ్ నాయకుడు షేక్ జానీబాషా, కౌలు రైతు సంఘం నాయకుడు గరికిపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మకు పోలీస్ కమిషనర్ పట్టు వస్త్రాలు

**కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి కమిషనర్ రాజశేఖర్‌బాబు**



విజయవాడ (ప్రశ్న న్యూస్) దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మకు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆనవాయితీ ప్రకారం ఉత్సవాలకు ముందురోజు శనివారం రాత్రి ఆయన కుటుంబ సభ్యులు, నగర పోలీసు సిబ్బంది కుటుంబాలతో కలిసి అమ్మవారి సన్నిధికి విచ్చేశారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు ఆలయ ఈవో వీరభద్రం శీనా నాయక్, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. భక్తిశ్రద్ధలతో పట్టు వస్త్రాలు సమర్పించిన కమిషనర్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, దసరా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరగాలని అమ్మవారిని ప్రార్థించారు.

### వేద పండితుల ఆశీర్వచనం

దర్శనం అనంతరం ఆలయ పండితులు పోలీస్ కమిషనర్‌కు వేద ఆశీర్వచనం అందజేశారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భద్రత, రద్దీ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తున్నారు.

### ఉత్సవాల వేళ భద్రతకు ప్రాధాన్యం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవాడలో అత్యంత వైభవంగా జరుగుతాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనుండటంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, క్యూలైన్ల వద్ద భద్రత, రద్దీ నిర్వహణ వంటి అంశాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఉత్సవాల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచింది. కుటుంబ సమేతంగా ఆయన అమ్మవారిని దర్శించుకోవడంతో ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సంప్రదాయబద్ధంగా
# ప్రారంభించిన బతుకమ్మ సంబరాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే సంస్కృతికి ప్రతిబింబమైన బతుకమ్మ వేడుకలు మహాలయ అమావాస్య రోజున సంప్రదాయబద్ధంగా ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు వివిధ రకాల పూలతో మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండవ రోజు అటుకుల బతుకమ్మ, మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాల్గవ రోజు నాన బియ్యం బతుకమ్మ, ఐదవ రోజు అట్ల బతుకమ్మ, ఆరవ రోజు అలిగిన బతుకమ్మ, ఏడవ రోజు వేప కాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్న ముద్దల బతుకమ్మ, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా ప్రసిద్ధి చెందిన ఈ పూల పండుగ సందర్భంగా గ్రామాల నుండి పట్టణాలు, నగరాల్లో వాడవాడలా సందడి నెలకొంటుంది. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేసి గౌరీ దేవిని స్తుతిస్తు అడి పాడి సమీపంలోని నీటి వనరుల్లో నిమజ్జనం చేసారు.



# పేదల పక్షాన నిలిచిన నేత రంగా

**- ముట్లూరులో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన పెమ్మసాని, రాధాకృష్ణ, ఎమ్మెల్యే రామాంజనేయులు**

ముట్లూరు(ప్రశ్న న్యూస్) పేదలకు అండగా నిలిచి, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యాన్ని ప్రజలకు అందించిన నాయకుడు వంగవీటి మోహనరంగా అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామంలో స్థానిక కూటమి నాయకులు, అభిమానులు ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహాన్ని ఆయన కుమారుడు వంగవీటి రాధాకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులుతో కలిసి శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్నవారికి, అన్యాయం జరిగినవారికి రంగా తీసుకున్న నిర్ణయాలు భరోసానిచ్చేవని పేర్కొన్నారు. రంగా పేరు వినగానే అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం, పేదల పట్ల అభిమానం, ప్రజాసేవకు అంకితమైన వ్యక్తిత్వం గుర్తుకొస్తాయని చెప్పారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు.

### రూ.5.50 కోట్లతో అభివృద్ధి పనులు

చేబ్రోలు, వట్టిచెరుకూరు తదితర ప్రాంతాల్లో రూ.5.50 కోట్ల నిధులతో రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పెమ్మసాని తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ ద్వారా ప్రాంత అభివృద్ధికి మార్గం సుగమమవుతుందన్నారు. ఈ పనులకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా సాగాలంటే సమర్థవంతమైన నాయకత్వంతోపాటు ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య ఐక్యత అవసరమన్నారు. వ్యక్తిగత విభేదాలు, మనస్పర్థల వల్ల చివరకు నష్టపోయేది పేదలేనని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. వంగవీటి రాధాకృష్ణ మృదుస్వభావి, అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి అని, ప్రత్తి పాపారావు ఘర్షణలు తలెత్తినప్పుడు సమన్వయంతో ముందుకు నడిపించగల నాయకుడని పేర్కొన్నారు.

### ప్రజల గుండెల్లో రంగా

వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ.. కొందరు నాయకులు మరణించినా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, అందుకు తన తండ్రి వంగవీటి మోహనరంగా నిదర్శనమని అన్నారు. గతంలో ముట్లూరు గ్రామానికి రంగా సహాయం చేశారని గ్రామస్థులు గుర్తుచేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇంతకాలం ఆయన సేవలను గుర్తుంచుకుని గ్రామస్థులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సామాన్యులకు న్యాయం అందుబాటులో ఉండాలని, ఎవరికీ అన్యాయం జరగకూడదనే లక్ష్యంతో రంగా పోరాడారని చెప్పారు.

### అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి

ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధిని కాంక్షించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రంగా పనిచేశారని పేర్కొన్నారు. ఎక్కడ సమస్య ఎదురైనా ధైర్యంగా ముందుకు వెళ్లే నాయకుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. ఆయన విగ్రహావిష్కరణలో భాగస్వామిని చేసిన గ్రామస్థులకు కృతజ్ఞతలు



తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, డీసీసీబీ చైర్మన్ వడ్రానం హరిబాబు, టీడీపీ నాయకుడు ఉద్యోరాల సీతారామయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, విగ్రహ దాత నందిగం రవీంద్రబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు జగన్, జనసేన మండల నాయకులు ప్రత్తి పాపారావు, బీరాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ ఎనుముల రాంబాబు, మాజీ సర్పంచి వీరిశెట్టి జగన్, జనసేన సీనియర్ నాయకుడు జోసఫ్ తంబి, మండల ప్రధాన కార్యదర్శి అల్లం రామయ్య, గంగిశెట్టి వెంకటేశ్వరరావు, ముట్లూరు కాపు సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుద్దీపాల వెలుగుల్లో వైకుంఠం

**శేషాచల కొండల్లో నవరాత్రి బ్రహ్మోత్సవ శోభ..**
**ఏడుకొండలపై ఆధ్యాత్మిక కాంతుల హరివిల్లు..**
**కనువిందు చేస్తున్న తిరుమల సోయగాలు**





తిరుమల(ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన శేషాచల క్షేత్రం విద్యుద్దీపాల వెలుగుల్లో దేదీప్యమానంగా విరాజిల్లుతోంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల వేళ ఏడుకొండలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. కొండల నడుమ రంగురంగుల విద్యుత్ కాంతులు.. ఆలయ పరిసరాల్లో ప్రత్యేక అలంకరణలు.. గోవింద నామస్మరణతో మార్మోగుతున్న తిరుమల.. భక్తులకు కనువిందు చేస్తున్నాయి. పగలంతా స్వామివారి దర్శనంతో పులకించిపోయే భక్తులకు.. రాత్రివేళ విద్యుద్దీపాల వెలుగుల్లో మెరిసిపోయే తిరుమల మరో అద్భుత అనుభూతిని అందిస్తోంది. ప్రకృతి అందాలకు ఆధ్యాత్మిక వైభవం తోడవడంతో శ్రీవారి క్షేత్రం భూలోక వైకుంఠాన్ని తలపిస్తోంది.

### కాంతులీనుతున్న కొండలు

నవరాత్రి బ్రహ్మోత్సవాలు తిరుమల క్షేత్రానికి ప్రత్యేక ఆకర్షణ. ఈ పవిత్ర ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు, ప్రధాన మార్గాలు, కూడళ్లు, భక్తుల రాకపోకలు సాగించే ప్రాంతాలు విద్యుద్దీపాల కాంతులతో కళకళలాడుతున్నాయి. రాత్రివేళల్లో కొండలపై వెలుగులు విరజిమ్ముతుండగా.. ఆ దృశ్యాలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వివిధ రంగుల్లో మెరిసే దీపాలంకరణలు తిరుమల సౌందర్యాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నాయి.సాధారణ రోజుల్లోనే పచ్చని కొండలు, ప్రకృతి రమణీయతతో అలరించే శేషాచలం.. బ్రహ్మోత్సవాల వేళ వెలుగుల అలంకరణతో మరింత అందంగా కనిపిస్తోంది. చీకటి తెరలు కమ్ముకున్న వేళ విద్యుద్దీపాల కాంతులు కొండలపై విరబూస్తూ అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. దూరం నుంచి తిరుమలను తిలకించే వారికి వెలుగుల హారంలా కనిపిస్తుండగా.. సమీపంలో ఉన్న భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్నాయి.

### అడుగడుగునా ఆధ్యాత్మిక శోభ

శ్రీవారి బ్రహ్మోత్సవాలంటేనే భక్తులకు ఓ ప్రత్యేక అనుభూతి. స్వామివారి వాహన సేవలు, మంగళవాయిద్యాల నాదాలు, వేద మంత్రోచ్చారణలు, గోవింద నామస్మరణతో తిరుమల క్షేత్రం భక్తిపారవశ్యంలో మునిగిపోతుంది. ఈ ఉత్సవాలకు విద్యుద్దీపాల అలంకరణ తోడవడంతో క్షేత్ర సౌందర్యం మరింత ఆకట్టుకుంటోంది. ఆలయ పరిసరాల్లో కనిపించే కాంతులు, భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణం కలగలిసి తిరుమలను పండుగ శోభతో నింపుతున్నాయి.ఏడుకొండలవాడిని దర్శించుకోవాలనే కోరికతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుమలకు చేరుకుంటారు. స్వామివారి సన్నిధిలో తలవంచి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు.. బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రంలో నెలకొన్న ప్రత్యేక వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. దర్శనానికి వెళ్లే మార్గాల్లో విద్యుద్దీపాల అలంకరణలు కనిపిస్తుండటంతో భక్తులు వాటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు. కుటుంబ సమేతంగా వచ్చే వారు ఈ అందమైన దృశ్యాలను తమ జ్ఞాపకాల్లో పదిలపరుచుకుంటున్నారు.

### ప్రకృతి అందాలకు ఆధ్యాత్మిక వెలుగులు

శేషాచలం కొండల ప్రత్యేకత ప్రకృతి సౌందర్యం. పచ్చని వృక్షసంపద, ఎత్తైన కొండలు, మలుపులు తిరిగే ఘాట్ రహదారులు తిరుమలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. అలాంటి ప్రకృతి ఒడిలో కొలువైన శ్రీవారి ఆలయం.. బ్రహ్మోత్సవాల వేళ విద్యుద్దీపాల వెలుగుల్లో మెరిసిపోవడం మరో విశేషం. కొండల సహజ అందాలకు విద్యుత్ కాంతులు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి.
రాత్రివేళల్లో తిరుమల పరిసరాలను తిలకిస్తే.. ప్రకృతి, భక్తి, సంప్రదాయాలు ఒకేచోట కలిసినట్లు కనిపిస్తోంది. వెలుగుల మధ్య మెరిసే కొండలు.. భక్తుల నోట వినిపించే గోవింద నామాలు.. ఆలయం చుట్టూ నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం మనసుకు ప్రశాంతతను అందిస్తున్నాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ దృశ్యాలు ఉత్సవాల మధురానుభూతిని మరింత పెంచుతున్నాయి.

### వైభవానికి ప్రతీక బ్రహ్మోత్సవాలు



తిరుమల నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఉత్సవాలు శ్రీవారి మహిమను చాటిచెబుతాయి. ఉత్సవాల్లో భాగంగా జరిగే వాహన సేవలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ వాహనాలపై దర్శించుకోవడం భక్తులకు అపూర్వమైన అనుభూతి. ఆ వేడుకలతోపాటు క్షేత్రంలో కనిపించే అలంకరణలు ఉత్సవ వైభవాన్ని మరింత పెంచుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగుల్లో తిరుమల ఆలయ పరిసరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా.. ఆ కాంతులు ఉత్సవాల సందడికి మరింత అందాన్ని జోడిస్తున్నాయి. భక్తుల రాకతో కొండపై ఆధ్యాత్మిక సందడి నెలకొంటోంది. స్వామివారి నామస్మరణతో మార్మోగే మార్గాలు.. భక్తి భావాన్ని నింపే వాతావరణం.. వెలుగుల్లో మెరిసే శేషాచలం.. ఇవన్నీ కలిపి బ్రహ్మోత్సవాల ప్రత్యేకతను చాటుతున్నాయి.

### భక్తుల మదిలో చెరగని ముద్ర

తిరుమలకు వచ్చే భక్తులకు స్వామివారి దర్శనమే ప్రధాన లక్ష్యం. అయితే బ్రహ్మోత్సవాల సమయంలో కనిపించే విద్యుద్దీపాల అలంకరణలు, కొండల సోయగాలు కూడా వారి యాత్రలో భాగమవుతున్నాయి. స్వామివారి దర్శనానంతరం తిరుమల పరిసరాల్లోని వెలుగుల అందాలను ఆస్వాదిస్తూ భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక అనుభూతితోపాటు ప్రకృతి అందాలను ఆస్వాదించే అవకాశం లభించడం విశేషం.శ్రీవారి సన్నిధిలో గడిపే ప్రతి క్షణం భక్తులకు ప్రత్యేకమే. అలాంటి పవిత్ర క్షేత్రం ఉత్సవాల వేళ వెలుగులతో విరాజిల్లుతుంటే ఆ ఆనందం మరింత రెట్టింపవుతోంది. విద్యుద్దీపాల కాంతుల్లో మెరిసే శేషాచల కొండలు.. భక్తి పారవశ్యంలో మునిగే భక్తజనం.. గోవింద నామస్మరణతో మార్మోగే తిరుమల.. నవరాత్రి బ్రహ్మోత్సవాల వైభవానికి ప్రతీకగా నిలుస్తున్నాయి.

### గోవింద నామస్మరణతో పులకింత

నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో కనిపిస్తున్న ఈ వెలుగుల సోయగం కేవలం అలంకరణకే పరిమితం కాదు. శ్రీవారి క్షేత్ర వైభవాన్ని, భక్తుల విశ్వాసాన్ని, తిరుమల సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తోంది. ఏడుకొండలపై విరాజిల్లుతున్న విద్యుద్దీపాల కాంతులు భక్తుల మనసుల్లో భక్తిభావాన్ని మరింత పెంచుతున్నాయి.ఆకాశాన్ని తాకేలా కనిపించే శేషాచల శిఖరాలు.. వాటి నడుమ వెలుగులు విరజిమ్మే తిరుమల.. స్వామివారి నామాన్ని స్మరిస్తూ ముందుకు సాగే భక్తజనం.. ఈ దృశ్యాలన్నీ కలియుగ వైకుంఠమైన తిరుమల ప్రత్యేకతను చాటుతున్నాయి. ఉత్సవాల వేళ వెలుగుల



హరివిల్లుగా మారిన ఏడుకొండలు భక్తులకు మరపురాని అనుభూతిని అందిస్తున్నాయి.విద్యుద్దీపాల కాంతుల్లో వెలిగిపోతున్న తిరుమల..
ఆధ్యాత్మిక వైభవానికి అద్దం పడుతోంది. శేషాచల కొండల్లో విరాజిల్లే శ్రీనివాసుడి దివ్యక్షేత్రం భక్తి, ప్రకృతి, సంప్రదాయాల సంగమంగా నిలుస్తోంది.

# వెలుగుల కాంతుల్లో ఇంద్రకీలాద్రి

## కనులవిందుగా దుర్గమ్మ కొండ..

**- నవరాత్రి వైభవానికి ముస్తాబు - శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం..**

**- భక్తులకు ఆహ్వానం పలుకుతున్న దేదీప్యమాన కాంతులు**









విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రి.. విద్యుద్దీపాల వెలుగుల్లో మెరిసిపోతోంది. దుర్గమ్మ కొండపై రంగురంగుల విద్యుత్ అలంకరణలు కనువిందు చేస్తున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాల వేళ కనకదుర్గమ్మ దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచేలా కొండ పరిసరాలను తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణం మొదలుకొని కొండపైకి వెళ్లే మార్గాలు, పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. అమ్మవారి సన్నిధికి చేరుకునే భక్తులకు భక్తిభావంతోపాటు పండుగ వాతావరణాన్ని అందించేలా ఏర్పాట్లు ఆకట్టుకుంటున్నాయి.విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఏటా నిర్వహించే దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. తొమ్మిది రోజులపాటు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. ఆలయానికి వచ్చే ప్రధాన మార్గాల్లో విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రాత్రివేళ వెలుగుల మధ్య కొండ అందాలు మరింత ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి.

### వెలుగుల వర్ణవైభవం

కొండపై ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు, రంగురంగుల కాంతులు ఉత్సవ శోభను ఇనుమడింపజేస్తున్నాయి. ఆలయ పరిసరాల్లోని అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. దూరం నుంచి ఇంద్రకీలాద్రిని వీక్షించినా విద్యుత్ కాంతుల వైభవం స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేశారు. పగటిపూట భక్తుల రద్దీతో సందడిగా ఉండే కొండ ప్రాంతం, రాత్రివేళ విద్యుద్దీపాల వెలుగులతో మరో రూపాన్ని సంతరించుకుంటోంది.అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఆలయ పరిసరాల అలంకరణలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చే వారు ఈ వెలుగుల మధ్య ఉత్సవ వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇంద్రకీలాద్రి అందాలను వీక్షిస్తూ అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు మధురానుభూతిని కలిగిస్తోంది. ఆధ్యాత్మికత, సంప్రదాయం, ఉత్సవ వైభవం కలగలిసిన వాతావరణం కొండపై నెలకొంది.

### తొమ్మిది రోజులూ ప్రత్యేకమే!

దేవీ శరన్నవరాత్రుల్లో అమ్మవారు రోజుకో అలంకారంలో దర్శనమివ్వడం విశేషం. ఒక్కో అలంకారానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉండటంతో భక్తులు తమకు ఇష్టమైన రూపంలో అమ్మవారిని దర్శించుకునేందుకు ఆసక్తి చూపుతారు. కుటుంబాల సంక్షేమం, ఆరోగ్యం, సుఖసంతోషాలు, సంతానం, విద్యాభివృద్ధి, విజయాలు కలగాలని కోరుకుంటూ భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తారు.నవరాత్రుల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు, క్యూలైన్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కీలకంగా మారుతాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆలయ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

### భక్తుల భద్రతకు ప్రాధాన్యం

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం అత్యంత ముఖ్యం. క్యూలైన్ల నిర్వహణ, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరం. వృద్ధులు, చిన్నపిల్లలు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో భక్తులకు సరైన సమాచారం అందించడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంటాయి. విద్యుద్దీపాల అలంకరణల మధ్య భద్రతా ప్రమాణాలు పాటించడం, విద్యుత్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించడం అవసరం.

### ఆధ్యాత్మిక శోభకు చిరునామా

కృష్ణానది తీరాన వెలసిన ఇంద్రకీలాద్రి విజయవాడకు ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలుస్తోంది. కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తుంటారు. నవరాత్రుల సమయంలో ఈ ప్రాంతం భక్తజన సందోహంతో కళకళలాడుతుంది. ఆలయ ఘంటానాదాలు, భక్తుల ప్రార్థనలు, ప్రత్యేక పూజలు, విద్యుత్ అలంకరణలు కలగలిసి ఇంద్రకీలాద్రికి ప్రత్యేక శోభను తీసుకొస్తాయి.దసరా పండుగను పురస్కరించుకుని విజయవాడ నగరంలోనూ సందడి పెరుగుతుంది. ఆలయ దర్శనంతోపాటు నగరంలోని పండుగ వాతావరణాన్ని ఆస్వాదించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతారు. భక్తులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన దర్శన అనుభవాన్ని అందించడంలో ఆలయ అధికారులు, పోలీసు, మున్సిపల్, ఇతర శాఖల సమన్వయం కీలకం కానుంది.

### భక్తులకు కనువిందు.. అమ్మవారి సన్నిధిలో పండుగ శోభ

శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై విరాజిల్లుతున్న విద్యుద్దీపాల అలంకరణలు ఉత్సవ వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. భక్తిభావంతో కొండపైకి చేరుకునే వారికి వెలుగుల వర్ణవైభవం స్వాగతం పలుకుతోంది. అమ్మవారి ఆశీస్సులు పొందాలనే ఆకాంక్షతో తరలివచ్చే భక్తులతో ఇంద్రకీలాద్రి మరింత సందడిగా మారనుంది. ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే దుర్గమ్మ కొండ.. నవరాత్రుల వేళ విద్యుత్ కాంతులతో మెరిసిపోతూ విజయవాడ నగరానికే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

# విద్యుద్దీపాల వెలుగుల్లో శ్రీశైల క్షేత్రం

**నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు**

**రేపటి నుంచి తొమ్మిది రోజులపాటు**

**ఉత్సవ వైభవం.. కనువిందు చేస్తున్న**

**ఆలయ అలంకరణలు**







శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి క్షేత్రం నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయ ప్రాంగణం విద్యుద్దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. రంగురంగుల విద్యుత్ అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి తొమ్మిది రోజులపాటు వైభవంగా జరగనున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. స్వామి, అమ్మవార్ల దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### కాంతులీనుతున్న ఆలయ ప్రాంగణం

శ్రీశైలం క్షేత్రం శైవ సంప్రదాయానికి, శక్తి ఆరాధనకు విశిష్టమైన కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడ కొలువుదీరిన శ్రీ మల్లికార్జున స్వామివారు ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకరుగా, శ్రీ భ్రమరాంబ అమ్మవారు అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకరిగా పూజలందుకుంటున్నారు. ఈ పవిత్ర క్షేత్రంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం, ప్రధాన ప్రవేశ మార్గాలు, పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాత్రివేళ వెలుగుల మధ్య ఆలయ శోభ మరింత ఇనుమడిస్తోంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ అలంకరణలు కనువిందు చేస్తున్నాయి. ఆలయ పరిసరాల్లో నెలకొన్న పండుగ వాతావరణం భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతోంది.

### తొమ్మిది రోజులూ ప్రత్యేకమే..

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, అర్చనలు, ఆగమ సంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. ఉత్సవాల రోజుల్లో క్షేత్రానికి భక్తుల రాక పెరిగే అవకాశం ఉండటంతో ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు.నవరాత్రులు శక్తి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తాయి. అమ్మవారిని వివిధ రూపాల్లో ఆరాధిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుటుంబాల సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం, సకల శుభాలు కలగాలని ప్రార్థిస్తారు. శ్రీశైల క్షేత్రంలో స్వామివారి ఆరాధనతోపాటు భ్రమరాంబ అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించడం భక్తులకు విశేషమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది.

### భక్తులకు సౌకర్యాల కల్పనపై దృష్టి

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి, రవాణా వంటి సదుపాయాలు కీలకం కానున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలకు అవసరమైన సహాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం ముఖ్యం. అదేవిధంగా ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడటం, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, విద్యుత్ అలంకరణల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. భక్తులు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి.

### ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా..



నల్లమల అటవీ ప్రాంతం మధ్య వెలసిన శ్రీశైల క్షేత్రం ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక విశిష్టతతో భక్తులను ఆకర్షిస్తోంది. సాధారణ రోజుల్లోనే భక్తులతో సందడిగా ఉండే ఈ పుణ్యక్షేత్రం నవరాత్రి బ్రహ్మోత్సవాల వేళ మరింత కళకళలాడనుంది. విద్యుద్దీపాల కాంతులు, ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తుల ఆధ్యాత్మిక సందడి కలగలిసి ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకురానున్నాయి.తొమ్మిది రోజులపాటు జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న శ్రీశైల క్షేత్రం ఉత్సవాలకు సిద్ధమవుతూ భక్తులకు ఆధ్యాత్మిక ఆహ్వానం పలుకుతోంది.

# ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు

**- ఒకే రోజు రెండుసార్లు ప్రకంపనలు**




డెహ్రాడూన్ (ప్రశ్న న్యూస్) ఉత్తరాఖండ్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో రెండుసార్లు భూమి కంపించింది. సాయంత్రం ఉత్తరకాశీ జిల్లాలో భూకంపం సంభవించగా, అంతకు కొన్ని గంటల ముందు బాగేశ్వర్ జిల్లాలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస ఘటనలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం శనివారం రాత్రి 8:07 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైంది. భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు మధ్యాహ్నం 3:40 గంటలకు బాగేశ్వర్ జిల్లాలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 5 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. ఈ రెండు భూకంపాల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు ఇంతవరకు సమాచారం అందలేదు. ఇటీవలి కాలంలో ఉత్తరాఖండ్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తున్నాయి. అక్టోబర్ 6వ తేదీన చమోలీ జిల్లాలో 4.9 తీవ్రతతో భూకంపం రాగా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలపై కూడా పడింది. తాజా ప్రకంపనలతో దేవభూమిలో మరోసారి భూకంపాల భయం నెలకొంది.

# ప్రభుత్వానికి భయం పట్టుకుంది

**- ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.
దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

# సుప్రీం అసాధారణ నిర్ణయం

**- కోర్టు ధిక్కారంపై నేడే విచారణం- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్**

**- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్ - నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ తో ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ, ఆదివారం విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భారీ ఎత్తున ఆంక్షలు విధించారు. మెట్రో స్టేషన్లను పూర్తిగా మూసేయడంతో పాటు రోడ్లనూ ఎక్కడికక్కడ బ్యారికేడ్లతో దిగ్బంధించారు. రెండు రోజుల క్రితమే మొదలైన ఈ ఆంక్షలపై సుప్రీంకోర్టు నిన్న జోక్యం చేసుకుంది. లాయర్ కపిల్ సిబల్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు నిరసనలను కట్టడి చేసే పేరుతో పూర్తిగా ఆంక్షలు విధించవద్దని ఆదేశాలు ఇచ్చింది. అయినా ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఆంక్షలు కొనసాగించారు.ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల ఉల్లంఘన జరిగిందని ఆరోపిస్తూ దాఖలైన ధిక్కార పిటిషన్ పై నేడు సెలవు దినమైనా ప్రత్యేక విచారణ నిర్వహించాలని అత్యున్నత న్యాయస్థానం నిర్ణయించింది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారించనుంది. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించినందుకు కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ డి.తారాలపై ధిక్కార చర్యలు తీసుకోవాలని ఈ పిటిషన్‌లో కోరారు.ఢిల్లీ నిరసనల సమయంలో మెట్రో, రైల్వే సర్వీసులను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, అధికారులు ప్రజా రవాణాపై ఆంక్షలు విధించడం కొనసాగించారని పిటిషనర్ ఆరోపించారు.
మెట్రో స్టేషన్లను నిరంతరం మూసివేయడం, రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలగడంతో పాటు జాతీయ రాజధానిలో ప్రజా జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనిపై విచారణ జరిపి అధికారులపై ధిక్కార చర్యలు తీసుకోవాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరుతున్నారు. సుప్రీంకోర్టు గత విచారణ సందర్భంగా 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపై ఆంక్షలు విధించాలని ఢిల్లీ పోలీసులు జారీ చేసిన ఆదేశాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. చివరికి ఢిల్లీ మెట్రో రైల్వే కార్పొరేషన్ ఈ మూసివేతను 45 మెట్రో స్టేషన్లకు తగ్గించింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588